# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 232 | హైదరాబాద్ | శనివారం 07-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు: ట్రంప్ తాజా వ్యాఖ్యలు

## చెప్పులు కుట్టిన జాతి..
# ఈ రాజ్యాన్ని నడపాలి..

- సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- ప్రభుత్వానికి కళ్లు, చెవులు నా ప్రభుత్వ ఉద్యోగులే..
- సంక్షేమం, అభివృద్ధి మా సంకల్పం
- పంచడానికి ప్రభుత్వం వద్ద భూముల్లేవు
- మాదిగ జాతి కోసం ఏం చేయాలో అన్నీ చేస్తాం
- ఎలా పిలిచినా ఇబ్బంది లేదు..
- నేను అందరి వాడిని.. సీఎం రేవంత్ వ్యాఖ్య



11లో





## పశ్చిమాసియాలో యుద్ధం..
## శంషాబాద్ నుంచి
# 12 విమానాలు రద్దు

11లో

- గల్ఫ్ దేశాలకు వెళ్లవలసిన విమానాలు రద్దైనట్లు అధికారులు వెల్లడి
- గల్ఫ్ దేశాల నుంచి రావాల్సిన 12 కూడా విమానాలు రద్దయ్యాయన్న అధికారులు
- ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన విమానాలు రద్దు





11లో

## 50 యుద్ధ విమానాలతో
# ఖమేనీని అంతం చేశాం : ఐడీఎఫ్

- ఫిబ్రవరి 28న ఇరాన్ పై జరిగిన దాడిలో పాల్గొన్న 50 యుద్ధ విమానాలు
- టెహ్రాన్ లోని భూగర్భ బంకర్ పై ఇజ్రాయెల్ భీకర దాడి
- ఈ దాడిలోనే ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతం
- ఆపరేషన్ రోర్ ఆఫ్ ది హారియర్ పేరుతో ఇజ్రాయెల్ సైనిక చర్య
- ఇరాన్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థ దెబ్బతిన్నట్లు ఐడీఎఫ్ ప్రకటన

# కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయి

- అమెరికా ఇజ్రాయెల్ యుద్ధంపై స్పందించిన ఇరాన్ అధ్యక్షుడు
- కొన్ని దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తున్నాయన్న మసూద్ పెజెష్కియాన్
- ఇజ్రాయెల్ పైకి అత్యాధునిక ఖోరంషహర్-4 క్షిపణుల ప్రయోగం
- ఇరాన్ నేవీని నామరూపాల్లేకుండా చేశామన్న అమెరికా



- భారీ బాంబులతో ఇరాన్ అణు కేంద్రాలపై విరుచుకుపడ్డ బి-2 బాంబర్లు

11లో



11లో

## సోషల్ మీడియాలో
# వైరల్ అవ్వాలని రిస్క్ వద్దు

- లైకుల కోసం యువత జీవితాన్ని రిస్క్ చేయవద్దని హితవు
- రైలు నుంచి వేలాడుతూ రీల్ చేస్తుండగా స్తంభం ఢీకొని యువకుడి మృతి
- ఈ వీడియోను షేర్ చేసి హెచ్చరిక చేసిన సజ్జనార్



11లో

## శాసనమండలికి వచ్చిన బొత్సను
# ఆత్మీయంగా పలకరించిన లోకేశ్

- ఇటీవల అనారోగ్యం పాలైన బొత్స సత్యనారాయణ
- పూర్తి ఆరోగ్యంతో బొత్స సభకు రావడం సంతోషంగా ఉందన్న లోకేశ్
- లోకేశ్ కి ధన్యవాదాలు తెలిపిన బొత్స

## యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల విడుదల..

రాజస్థాన్ డాక్టర్ కు టాప్ ర్యాంక్

- మొదటి ర్యాంకు సాధించిన రాజస్థాన్ యువకుడు అనుజ్ అగ్నిహోత్రి



11లో

## పెళ్లికి వెళ్లి "రప్పా రప్పా" అంటూ
# దాడులు చేయటం ఎక్కడి సంస్కృతి?

- గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను వెంటేసుకుని తిరగడం దారుణం అంటూ ఫైర్
- ఏడుకొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే కుట్రలు మొదలు అని ఆరోపణ
- పోస్టుమార్టానికి కారకులైన వారే పరామర్శలకు వెళుతున్నారని వ్యాఖ్యలు



11లో

## ఏపీలో 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం : సీఎం చంద్రబాబు కీలక ప్రకటన

11లో

భారతశక్తి

# యుద్ధం కూడా ఎన్నికల అస్త్రమే

ఇరాన్ అణు కార్యకలాపాలు ఆపడం లేదని అమెరికా మిడిల్ ఈస్ట్‌లో అగ్ని పుట్టించింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులు చేస్తోంది. తొలిరోజు దాడిలోనే సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణించాడు. దీంతో ఇరాన్ కూడా ప్రతిదాడులు తీవ్రతరం చేసింది. అమెరికాకు అండగా నిలిచిన సున్నీ జనాభా అధికంగా ఉండే గల్ఫ్ దేశాలపై వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయాన్ని అటాక్ చేసింది. ఇక సౌదీ అరేబియాలోని ఆరామ్‌కో రిఫైనరీపై దాడిచేసింది. దీంతో ఆయిల్ ఉత్పత్తి, శుద్ధి నిలిచిపోయాయి. మరోవైపు ఆర్మూజ్ జలసంధి మూసివేసింది. ఈ క్రమంలో కేంద్రం గల్ఫ్ దేశాల్లోని భారతీయలను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే చాలా మందిని స్వదేశానికి రప్పించింది. యుద్ధం నేపథ్యంలో దేశంలో ఆయిల్ సంక్షోభం తలెత్తకుండా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ తరుణంలో దేశంలోని విపక్ష పార్టీలు లౌకికవాదం ముసుగులో మోదీ టార్గెట్‌గా కేంద్రంపై విమర్శలు చేస్తున్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని అమెరికా చంపేసిందని దీనిని ప్రధాని మోదీ ఖండించాలని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ డిమాండ్ చేశారు. ఒక దేశా అధినేతను చంపితే మోదీ అమెరికాకు లొంగిపోయి మౌనం పాటిస్తున్నాడని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇజ్రాయెల్, అమెరికా యుద్ధాన్ని ఖండించాలని డిమాండ్ చేశారు. ఖమేనీ హత్య తర్వాత ప్రపంచ వ్యాప్తంగా షియాలు నిరసన తెలిపారు. భారత దేశంలోని జమ్మూ కశ్మీర్‌లో, మిగతా కొన్ని ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు తీశారు. జమ్మూ కశ్మీర్‌లో ర్యాలీ ఉద్రికతతకు దారితీసింది. అయితే విపక్షాలు ఈ ర్యాలీలకు మద్దతు తెలిపాయి. అయితే ఇదంతా ఎందుకుం అంటే తమ ఓటు బ్యాంకు అయిన ముస్లింల కోసమే. ఇరాన్ యుద్ధం సాకుతో ముస్లింలకు అండగా ఉండడంతోపాటు మోదీని టార్గెట్ చేయడం ద్వారా తమ ఓటు బ్యాంకు బలపడుతుందని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తోపాటు వామపక్షాలు, ఇతర ప్రాంతీయ విపక్ష పార్టీలు భావిస్తున్నాయి. అయితే విపక్షాలు గమనించాల్సింది ఏమిటంటే.. ఈ యుద్ధం మొదట ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య మొదలైంది. కానీ, తర్వాత ఇరాన్ సున్నీలను టార్గెట్ చేస్తూ గల్ఫ్ దేశాలపై దాడులు చేయడంతో ఇప్పుడు సున్నీలు, షియాల మధ్య యుద్ధంగా మారింది. మన దేశంలో ముస్లిం జనాభాలో 85 శాతం సున్నీలే. షియాలతోపాటు మిగతా చిన్నచిన్నచిన్న ఇస్లామిక్ మతాలు కలిపి 15 శాతం ఉన్నాయి. షియాలకు మద్దతు తెలుపుతున్న దేశంలోని విపక్ష పార్టీలు. 85 శాతం ఉన్న సున్నీలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నామన్న విషయాన్ని విస్మరిస్తున్నాయి. దేశంలోని కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ అస్సాంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. బెంగాల్, అస్సాం, కేరళ రాష్ట్రాల్లో ముస్లిం జనాభా ఎక్కువ. ఇందులోనూ సున్నీలే 90 శాతం విపక్షాలు షియాలకు మద్దతుగా నిలవడం ద్వారా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సున్నీల ఓట్లు కోల్పోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మోదీ వ్యతిరేక ముస్లింలు మాత్రమే విపక్షాలకు మద్దతు తెలుపుతారని, షియా వ్యతిరేక సున్నీలు మద్దతు ఇచ్చే అవకాశం ఉండదని పేర్కొంటున్నారు. ఇరాన్ అణు కార్యక్రమాలు నిర్వహిస్తోందని, శాంతియుతంగా చర్చలు జరిపినా మారడం లేదని అగ్రరాజ్యం అమెరికా యుద్ధం ప్రకటించింది. ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధం చేస్తోంది. తొలి రోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని చంపేసింది. దీంతో ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. యూఏఈ, ఖతార్, బహ్రెయిన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌లు, రాయబార కార్యాలయాలు, ఆర్థిక మూలాలు లక్ష్యంగా వైమానిక దాడులు చేస్తోంది. ఇజ్రాయెల్‌పైనా యుద్ధం కొనసాగిస్తోంది. ఒమాన్ మినహా ఏడు ముస్లిం దేశాలు అమెరికా అనుకూలంగా ఉండటంతో యుద్ధం సుదీర్ఘంగా సాగే అవకాశం కనిపిస్తోంది. 'ఖమేనీ హత్య పరిణామాలు తీవ్రంగా ఉంటాయి, శత్రువులు ఏడ్వాల్సిందే' అని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్?4' పేరుతో పశ్చిమాసియాలో 27 అమెరికా స్థావరాలపై, యూఏఈలో జబేల్ అలీ పోర్టు, అబుదాబి విమానాశ్రయం, బుర్జ్ ఖలీఫాపై క్షిపణులు ప్రయోగించారు. బహ్రెయిన్, కువైట్‌లో సైరన్లు మోగిపోయాయి. ఇదిలా ఉంటే ఈ యుద్ధం నుంచి భారత్ కూడా చాలా విషయాలు తెలుసుకోవాలి. అందులో ముఖ్యమైనవి ఐదు. ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ నుంచి సౌదీ, యూఏఈ, ఖతార్ వరకు ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఈ యుద్ధంలో పూర్తిగా విఫలమయ్యాయి. చైనా నుంచి తెచ్చుకున్న ఇరాన్ సిస్టమ్ కూడా డ్రోన్‌లు, క్షిపణులను అడ్డుకోలేదు, హెచ్చరికలు ఇవ్వలేదు. దుబాయ్, షార్జా, బహ్రెయిన్‌లో అమెరికా బేస్‌లు ఒకేసారి దాడి ఎదుర్కొన్నాయి. భారత్‌తోపాటు ప్రపంచ దేశాలు ఈ సాంకేతికతలపై పునరాలోచన చేయాలి. ఇరాన్ ప్రజల మద్దతు, మిసైల్ స్టాక్ ఉన్నంతవరకు ఇరాన్ పోరాటం కొనసాగించే అవకాశం కనిపిస్తోంది. పరాజయం అంగీకరించే సూచనలు కనిపించడం లేదు. సుదీర్ఘ యుద్ధంతో అమెరికా, ఇరాన్‌తోపాటు అమెరికా మద్దతు ఇస్తున్న ముస్లిం దేశాలు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇరాన్ 'యుద్ధం మీరు మొదలుపెట్టారు, మేం ముగింపు పలుకుతాం' అని హెచ్చరిస్తోంది. ఇక ఈ యుద్ధంలో న్యూక్లియర్ శక్తి ఉన్న పాకిస్తాన్ ఆటలో అరటిపండుగా మారింది. సౌదీతో డిఫెన్స్ అగ్రిమెంట్ చేసుకుంది. యూఏఈతో కూడా రక్షణ ఒప్పందాలు చేసుకుంటూ ఇజ్రాయెల్ పక్షాన హమాస్‌కు వ్యతిరేకంగా సిద్ధమైంది. ఏ పక్షాన అని తెలియకుండా మౌనంగా ఉంది. మరోవైపు ఎవరూ పాకిస్తాన్‌ను సాయం అంగడం లేదు. కనీసం పట్టించుకోవడం లేదు. రంజాన్ మాసంలో జరిగిన యుద్ధం షియాలను ఇరాన్ పక్షాన, సున్నీలను (సౌదీ, యూఏఈ తదితరులు) అమెరికా?ఇజ్రాయెల్ వైపు నడిపింది. ఖమేనీ మరణానికి షియాలు ప్రపంచవ్యాప్తంగా నిరసనలు చేశారు, సున్నీలు మౌనంగా ఉన్నారు. ముస్లిం ఐక్యతకు ఈ యుద్ధం తీవ్ర దెబ్బ తీసింది. మొత్తంగా భారత దేశంలో విపక్షాల తీరు చూస్తుంటే.. యుద్ధం సాకుతో ఓటు బ్యాంకు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. అలా కాకుండా దేశం కోసం, అదే సమయంలో తమకు అనుకూలంగా ఉండే అంశాలపై మాట్లాడితే కొంత లబ్ధి కలుగుతుంది.

# బీపీ కమిటీ నివేదిక తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

విజయవాడ, మార్చి 6,

ఏపీ పాలిటిక్స్‌లో స్థానిక పోరు ఊరిస్తోంది. న్యూఇయర్ స్టార్టింగ్‌లోనే పంచాయతీ ఎలక్షన్స్ పెడతారని ఊహాగానాలు వినిపించినప్పటికీ..ఇప్పటికీ ఓ క్లారిటీ లేదు. జనగణన అడ్డంకిగా మారిందన్న ప్రచారం ఓవైపు..స్టేట్ ఈసీ రివ్యూస్..లోకల్ బాడీ పోల్స్‌పై సస్పెన్స్‌ను కంటిన్యూ చేస్తున్నాయి. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2న ముగుస్తుంది. మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం అయిపోనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక వరుసపెట్టి జూన్ లోపు స్థానిక ఎన్నికలను పూర్తి చేయాలనుకుంది ఏపీ సర్కార్. కానీ ఇంతలోనే ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీ అమలు దిశగా అడుగులు వేసింది. ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ రిపోర్ట్ ఇచ్చాక బీసీ కోటా పెంపుపై ఏదో ఒక నిర్ణయం తీసుకున్నాకే..లోకల్ ఫైట్‌పై ముందడుగు వేస్తారన్న టాక్ బయలుదేరింది. మరోవైపు రాష్ట్ర ఎన్నికల కమిషన్..ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? ఎంతమంది అనర్హులు ఉన్నారనే వివరాలను సేకరిస్తోంది. ఈ నెల 20 నాటికి ఈ కసరత్తు పూర్తి చేసి..ఓటర్ల జాబితాను ఫైనల్ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీని ప్రకారం..ఏప్రిల్ 2వ తేదీతో ముగియనున్న పంచాయతీలకు గడువు ప్రకారం..ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ రెడీగా ఉన్నట్లే. కానీ పల్లె పోరుపై సర్కారు ఆలోచన మాత్రం వేరేగా ఉందట. ఏప్రిల్ 2నే గ్రామాల స్థాయిలో పంచాయతీలకు గడువు ముగిసిపోనున్నా..ఈ ఎన్నికలకు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్లపై మిశ్రా కమిషన్ అధ్యయనం చేస్తోంది. ఆ రిపోర్ట్ వచ్చిన తర్వాత..ప్రభుత్వం అధ్యయనం చేసి..ఎన్నికలకు వెళ్లనుందని అంటున్నారు. ఈ ప్రాసెస్‌కు కొంత టైమ్ పట్టే అవకాశం ఉంటుంది. ఇక రిజర్వేషన్లపై ఎలాగూ న్యాయపరమైన సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వాటిన్నింటిని సాల్వ్ చేసుకుని..బీసీ కోటాను పెంచే లోకల్ బాడీ ఎన్నికలపై ముందుకెళ్లాలని సర్కార్ భావిస్తోందట. ఇలా స్థానిక పోరుపై ఎప్పటికప్పుడు అప్ డేట్స్ కమింగ్ సూన్ అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసినా..కూటమి ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను కాస్త ఆలస్యంగా నిర్వహించే యోచనలోనే ఉందంటున్నారు. ఏప్రిల్‌లోపు ఎన్నికలకు వెళ్తారని ప్రచారం జరుగుతున్న టైమ్‌లోనే ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లోకల్ బాడీస్‌లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచాలని డిసైడ్ అయింది. ఈ క్రమంలో సెన్సేషనల్ డెసిషన్ తీసుకుంది కూటమి ప్రభుత్వం. బీసీ కోటా పెంపు సాధ్యాసాధ్యాలు, న్యాయ సమస్యల అధ్యయనానికి కమిషన్ వేసింది సర్కార్. బీసీలకు రాజకీయంగా మేలు చేసే ఉద్దేశంతో ఏకంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు స్టార్ట్ చేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం మాజీ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది సర్కార్. ఈ కమిషన్ పూర్తిగా అధ్యయనం చేసి తన నివేదికను ప్రభుత్వానికి ఇస్తుంది. 45 రోజుల్లో నివేదికను ఇవ్వాలని కూడా ఏకసభ్య కమిషన్‌కు కాల పరిమితిని విధించింది సర్కార్. కమిషన్ ఇచ్చే రిపోర్ట్‌ను బేస్ చేసుకుని బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ప్రభుత్వం డెసిషన్ తీసుకోనుంది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. బీసీలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకుని ఎన్నికలకు వెళ్తే తమకు ఇంకా అడ్వాంటేజ్ మారుతుందని..బెటర్ రిజల్ట్స్ వస్తాయని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ఎలాగూ అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం ట్రంప్ కార్డుగా వాడుకునేందుకు ప్లాన్ చేస్తోంది ప్రభుత్వం. అయితే రిజర్వేషన్లు పెంపు హామీకి కూటమి సర్కార్ కట్టుబడి ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టు నిబంధనలు అడ్డుగా మారే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పే..బీసీ రిజర్వేషన్ల పెంపునకు సమస్యలు తెచ్చి పెడుతోంది. ఏపీలో ఇప్పటికే బీసీలకు 24 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. దీనిని 34 శాతానికి పెంచితే మొత్తం రిజర్వేషన్లు 60 శాతానికి చేరి సుప్రీంకోర్టు పెట్టిన కోటా దాటిపోనుంది. ఇటీవల తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు పెట్టిన పరిమితిని దాటాలని ప్రయత్నించినా, లీగల్ సమస్యలు వచ్చి కోర్టుల్లోనే ఆగిపోయిన పరిస్థితి. అయితే ఈ సమస్యలన్నింటిని దృష్టిలో పెట్టుకునే బీసీ రిజర్వేషన్ల పెంపునకు ట్రిపుల్ టెస్ట్ ఫార్ములాను ఫాలో అయ్యే ఆలోచనలో ఉందట కూటమి సర్కార్. అందుకే ముందుగా బీసీల వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసేందుకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని అంటున్నారు. ఎలాంటి చట్టపరమైన సమస్యలు రాకుండా సూచనలు ఇవ్వాలని ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్‌కు సూచించింది ప్రభుత్వం. ఒకవేళ కమిషన్ రిపోర్ట్ బేస్ చేసుకుని జీవోనో ఆర్డినెన్సో జారీ చేస్తే..లీగల్ సమస్యలు వచ్చినా కేంద్రంతో చర్చించి బీసీ కోటా పెంపునకు లైన్ క్లియర్ చేసుకోవాలని భావిస్తున్నారట కూటమి పెద్దలు. ఒకవేళ చట్టపరంగా రిజర్వేషన్ల పెంపునకు సమస్యలు వస్తే..పార్టీపరంగా బీసీలకు అధిక సీట్లు కేటాయించే యోచనలో కూడా ఉన్నారట. ఈ నేపథ్యంలో ఏపీలో పంచాయతీ ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

# క్రిస్టియన్ కార్డు

## ఎవరికి లాభం... ఎవరికి నష్టం

విజయవాడ, మార్చి 6

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం 'మతం' చుట్టూ సాగుతున్న రాజకీయం పెను దుమారం రేపుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఒక నిర్దిష్ట మతానికే పరిమితమైన పార్టీగా చిత్రీకరించడంలో తెలుగుదేశం కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా శాసనమండలి వేదికగా జరిగిన పరిణామాలు, సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు వైసీపీని తీవ్రమైన ఆత్మరక్షణలో పడేశాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమం నుంచి మతపరమైన అంశాల వైపు మళ్లుతోంది. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత విశ్వాసాలను ఆసరాగా చేసుకుని, ఆ పార్టీని ఒక క్రిస్టియన్ పార్టీగా ముద్ర వేయడం ద్వారా హిందూ ఓటు బ్యాంకును దూరం చేయాలనేది టీడీపీ పక్కా వ్యూహంగా కనిపిస్తోంది. శాసన మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు నేరుగా మండలి చైర్మన్ మోషేన్ రాజు, జగన్మోహన్ రెడ్డిలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి ఆజ్యం పోశాయి. తామంతా హిందువులమని, వారు క్రిస్టియన్లని ఆయన వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది. దీనిపై మోషేన్ రాజు తాను హిందువునని స్పష్టం చేయడం, అచ్చెన్నాయుడు క్షమాపణలు చెప్పడంతో సభలో ఆ వివాదం ముగిసినట్లు కనిపించినా, అసలు కథ సోషల్ మీడియాలో మొదలైంది. సభలో అచ్చెన్నాయుడు వెనక్కి తగ్గినప్పటికీ, టీడీపీ సోషల్ మీడియా విభాగం మాత్రం మోషేన్ రాజు గతంలో చర్చిల్లో పాల్గొన్న వీడియోలు, ఆయన మతపరమైన నేపథ్యాన్ని సూచించే ఫొటోలను బయటపెట్టింది. "నోటితో హిందువునని చెబుతూ, ఆచరణలో క్రిస్టియానిటీని పాటిస్తున్నారు" అనే అర్థం వచ్చేలా చేస్తున్న ప్రచారం వైసీపీని ఇరకాటంలో పడేసింది. ఈ పరిణామం వల్ల పార్టీ నాయకత్వం సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత కొన్ని రోజులుగా తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై చర్చ జరగాలని వైసీపీ పట్టుబట్టింది. ప్రభుత్వం చర్చకు వెనకాడుతోందని ప్రచారం చేసుకున్న వైసీపీకి, తీరా చర్చ మొదలయ్యాక సీన్ రివర్స్ అయ్యింది. చర్చను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైసీపీ సభ్యులు విఫలమయ్యారు. కేవలం సాంకేతిక అంశాల మీద కాకుండా, భావోద్వేగ అంశాల మీద ప్రభుత్వం చేసిన దాడిని వారు తిప్పికొట్టలేకపోయారు. వైసీపీ హయాంలోనే అపవిత్రం జరిగిందని, హిందూ ధర్మంపై ఆ పార్టీకి గౌరవం లేదని మంత్రులు చేసిన ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. జగన్ 'డిక్లరేషన్' అంశాన్ని కూడా దీనికి ముడిపెట్టడంతో, వైసీపీ కేవలం ఒక మతానికే కొమ్ముకాస్తోందనే భావనను కలిగించడంలో టీడీపీ కూటమి సక్సెస్ అయ్యింది. రాజకీయాల్లో ఒకసారి ముద్ర పడితే దాన్ని చెరిపేసుకోవడం చాలా కష్టం. గతంలో బీజేపీపై ఉన్న 'హిందూత్వ' ముద్రను ఆ పార్టీ బలంగా వాడుకోగా, ఇప్పుడు వైసీపీపై పడుతున్న 'క్రిస్టియన్ పార్టీ' ముద్రను టీడీపీ ఎన్నికల అస్త్రంగా మలుచుకుంటోంది. జగన్మోహన్ రెడ్డి తాను అన్ని మతాలను గౌరవిస్తానని చెబుతున్నా, పార్టీలోని కీలక నేతల మతపరమైన నేపథ్యాలను సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టడం ద్వారా వైసీపీని హిందూ వ్యతిరేక పార్టీగా చూపించే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. దీనివల్ల తటస్థంగా ఉండే హిందూ ఓటర్లు వైసీపీకి దూరం అయ్యే ప్రమాదం ఉంది. తిరుమల వంటి సున్నితమైన అంశాల్లో తడబడటం, సొంత పార్టీ నేతల మతపరమైన క్లారిటీ లేకపోవడం వైసీపీకి పెద్ద మైనస్ పాయింట్లుగా మారుతున్నాయి.

# జీరో పావర్టీ మిషన్ తో పేదల జీవన ప్రమాణాల పెంపు

అమరావతి, మార్చి 6

: రాష్ట్రంలో పేదరికాన్ని సంపూర్ణంగా రూపుమాపి, పేదల జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా జీరో పావర్టీ మిషన్ ను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతిలో సెర్ప్, మెప్మా, ఆర్టీజీఎస్ విభాగాలతో జీరో పావర్టీ మిషన్ కుటుంబ సాధికారితపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీకృత వ్యూహంతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయ సంఘాల సంస్థలు సెర్ప్, మెప్మా, ఆర్టీజీఎస్ వ్యవస్థలను సమన్వయం చేస్తూ జీరో పావర్టీ మిషన్ ను ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎస్ హెచ్ జీలకు సంబంధించి ఈ వ్యవస్థల నెట్వర్క్ ద్వారా 1.3 కోట్ల కుటుంబాల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అంశంపై వివిధ దేశాలు రాష్ట్రాల్లో అమలు అవుతున్న అత్యుత్తమ పేదరిక నిర్మూలన విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 2047 స్వర్ణాంధ్ర మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో జీరో పావర్టీ మిషన్ సమర్థంగా చేపట్టాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన మిషన్ కు సంబంధించి కేంద్రం అమలు చేస్తున్న నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1100 కోట్లను సమర్థంగా వినియోగించుకునేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. అటు జాతీయ అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్ ద్వారా పట్టణ ప్రాంతాల్లోనూ పేదరిక నిర్మూలన కోసం ప్రణాళికలు చేయాలన్నారు. వీటితో పాటు స్వయం సహాయ సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు స్వయం పేరిట బ్రాండింగ్ ఇచ్చి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# కలెక్టర్ రంగంలోకి దిగి....

తిరుపతి, మార్చి 6, (

తిరుపతి జిల్లాలో తహసీల్దారు తీరుపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్ అయ్యారు. ప్రజల సమస్యల్ని పరిష్కరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ భూ సమస్యపై విశ్రాంత సైనికుడు తహసీల్దారుకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో ఆయన కలెక్టర్‌ను కలిశారు.. ఈ క్రమంలో పుల్లంపేట తహసీల్దారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులతోనే నేరుగా అధికారులకు ఫోన్ చేయించగా.. వారు నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడంతో సస్పెండ్ చేస్తానని హెచ్చరించారుతిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తహసీల్దార్‌తో పాటూ రెవెన్యూ సిబ్బంది ఊహించిన షాకిచ్చారు. ఓ విశ్రాంత సైనికుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన కలెక్టర్.. ఆ బాధితుడితో అధికారులకు ఫోన్ చేయించి అడ్డంగా బుక్ చేశారు. విశ్వేశ్వరరావు సైనికుడిగా పనిచేశారు.. పదవీ విరమణ తర్వాత పుల్లంపేట ప్రాంతంలో ప్రభుత్వం 5.44 ఎకరాల భూమి కేటాయించింది. అయితే గత 20 ఏళ్లుగా ఈ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు.. బాధితుడు తహసీల్దారు చుట్టూ తిరిగి, తిరిగి విసుగొచ్చింది. ఎన్నిసార్లు వెళ్లి మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో విశ్వేశ్వరావు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారుపుల్లంపేట తహసీల్దారు పుల్లారెడ్డి, వీఆర్వో బొమ్మి శ్రీనివాసులు తన సమస్యను పరిష్కరించడం లేదని కలెక్టర్ దగ్గర తన గోడు వెళ్లబోసుకున్నారు విశ్వేశ్వరరావు. వెంటనే స్పందించిన కలెక్టర్.. తన ఎదురుగానే తహసీల్దారుకు ఫోన్ చేయాలని సూచించారు. ఆయన వెంటనే ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని మరోసారి కోరారు. తహసీల్దారు మరోసారి నిర్లక్ష్యంగానే సమాధానం చెప్పారు. ఆ భూమికి పట్టా ఉన్న సంగతి నిజమే.. కానీ ఆ భూమి మీ ఆధీనంలో లేదు కాబట్టి సర్వే చేయడం కుదరదని తహసీల్దారు అన్నారు. వెంటనే కలెక్టర్ వెంకటేశ్వర్ జోక్యం చేసుకున్నారు. 'విశ్వేశ్వరరావుకు గతంలో ఇచ్చిన పట్టాను రద్దు చేసి మరో ఇవ్వడమో.. ప్రస్తుతం ఇచ్చిన భూమిలో ఆక్రమణలు తొలగించడమో చేయాలి.. పైగా ఆ భూమిని కబ్జా చేసినవారికి మద్దతు తెలుపుతావా' అంటూ కలెక్టర్ తహసీల్దారుపై మండిపడ్డారువిశ్వేశ్వరరావుకు చెందిన భూమి విషయంలో త్వరగా చర్యలు తీసుకోవాలని.. భూమిని కబ్జా చేసిన వాళ్లపై కేసు నమోదు చేయాలని తహసీల్దారును ఆదేశించారు కలెక్టర్ వెంకటేశ్వర్. ఈ పని త్వరగా పూర్తిచేయకపోతే.. ఇద్దర్ని సస్పెండ్ చేస్తానని తహసీల్దారు, వీఆర్వోను హెచ్చరించారు. అలాగే రేణిగుంట విమానాశ్రయానికి దగ్గరలో ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఆ భూమిలో ఒకరు ప్లాట్లు వేస్తున్నారు.. స్థానికుడు ఒకరు స్పందించి వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. అయితే రివర్స్‌లో వీఆర్వో నీకేం సంబంధమంటూ స్థానికుడ్ని ప్రశ్నించారు. దీంతో ఆ వ్యక్తి కూడా కలెక్టర్‌ను కలిసి వీఆర్వోపై ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ నుంచి మరోసారి వీఆర్వోకు సదరు వ్యక్తి ఫోన్ చేశారు.. ఆయన మళ్లీ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కలెక్టర్ ఫోన్ తీసుకుని మాట్లాడారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.. వెంటనే ప్లాట్లు వేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టర్ నేరుగా బాధితులతో ఫోన్లు చేయించి అధికారులకు షాకిచ్చారు.. సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఈ ఊహించని పరిణామంతో అధికారులు అవాక్కయ్యారు.

# కారు, బైకు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

నల్గొండ చిట్యాల మండలం గుండ్రాంపల్లి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. కారు ఒక బైకును ఢీకొట్టింది. గాయపడ్డ బైక్ పై వెళ్తున్న వ్యక్తి పరిస్థితి విషమంగా వుంది. స్థానికులు ప్రమాద స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. కారులో ఉన్న వారిని ప్రమాదం గురించి అడిగి తెలుసుకుంటున్న సమయంలో స్థానికులతో వాగ్వాదానికి కారులో వచ్చిన నలుగురు యువకులు దిగారు. రాడ్డు తో స్థానికులను కొట్టడానికి ప్రయత్నించి హల్చల్ చేసి తప్పించుకున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# కలకలం రేపుతున్న విజయసాయి కామెంట్స్



నెల్లూరు, మార్చి 6,

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వాతావరణంలో "కూటమి ఉన్నంత వరకు వైసీపీకి అవకాశం లేదు" అనే వ్యాఖ్యలు మరోసారి చర్చకు వస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు పార్టీ మాజీ నాయకుడు, మాజీ ఎంపీ వేణు బాకం విజయసాయి రెడ్డి చేసినవే. నిజానికి, ఆ వ్యాఖ్యలు చెప్పకపోయినా, వైసీపీ నాయకులు కూడా కూటమి బలంగా ఉన్నప్పటి వరకు తమకు విజయం సాధించడం కష్టమే అన్న విషయం అంగీకరిస్తున్నారు.గత ఎన్నికల్లో జనసేన పై కేంద్రీకృత విమర్శలు, వైసీపీ పరోక్ష చర్యల ద్వారా కూటమి బలాన్ని పెంచడమే ప్రధాన వ్యూహంగా నిలిచింది. పవన్ కల్యాణ్ ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, "వైసీపీ కూటమికి బలాన్ని ఇచ్చింది, కాబట్టి కూటమి సరిగా ఉంటే విజయం సాధించగలదు" అని రాజమండ్రిలో ప్రకటించారు. ఎన్నికల సందర్భంలో, వైసీపీ కూటమి బలాన్ని బలపరిచే విధంగా ప్రవర్తించి..తన ఓటమికి స్వయంగా కారణం అయ్యింది. 2024 ఎన్నికల్లో కూటమిలో భాగమైన మూడు పార్టీలు కలిసి ఎన్నికల్లో వెళ్లడమే వైసీపీకి సవాల్ గా మారింది అనడంలో డౌట్ లేదు. భవిష్యత్తులో కూడా కూటమి బలంగా ఉండటం వల్ల స్థానిక స్థాయిలో వైసీపీకి ఎదురుదెబ్బలు తగలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాజకీయ విశ్లేషకులు చెబుతున్న విధంగా, ప్రస్తుత ప్రభుత్వం పై వ్యతిరేకత ఎక్కువగా ఉండటం సాధారణమే. ప్రజలు అందకపోయిన సంక్షేమ కార్యక్రమాల కోసం నిరుత్సాహపడటం సహజమే, కానీ ఇది వైసీపీకి నేరుగా లాభం ఇవ్వడం లేదు.అంచనాల ప్రకారం, వైసీపీ తనకు బలహీనంగా ఉన్న జిల్లాలపై ఎక్కువ దృష్టి పెట్టడం, బలంగా ఉన్న ప్రాంతాల్లో తక్కువ ఫోకస్ పెట్టడం వల్ల, ఓట్ల సమీకరణంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందువల్ల, ఒక ప్రాంతంలో ఓట్లు తగ్గినా, మరో ప్రాంతంలో వ్యూహాత్మకంగా పనిచేస్తే, అది సమతుల్యంగా బలం సమీకరించగలదు. చంద్రబాబు నాయుడు , పవన్ కల్యాణ్ ( ఇప్పటికే తమ వ్యూహాలు సజావుగా అమలు చేస్తున్నారు.మొత్తంగా, కూటమి బలంగా ఉండడం, స్థానిక వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల వైసీపీకి ఛాన్స్ తక్కువగా ఉంది. ఒక ప్రాంతంలో ఓట్లు తక్కువగా రావడం వల్ల వచ్చే నష్టాన్ని మరొక ప్రాంతంలో పూరించగలిగే అవకాశం కూటమికి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో, వైసీపీని అతి జాగ్రత్తగా వ్యూహాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో, గతంలో విజయసాయి రెడ్డి అన్న , "కూటమి బలంగా ఉన్నంత వరకు వైసీపీకి విజయం సాధించడం చాలా కష్టం" వ్యాఖ్యలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి అన్న చర్చ సాగుతోంది. వచ్చే ఎన్నికల్లో కూటమిని ఎదుర్కోవడానికి వైసీపీ వ్యూహాలు ఎలా పనిచేస్తాయో చూడాలి.

# గులాబీ వ్యూహం... ఇంతేనా

హైదరాబాద్, మార్చి 6, (

రాజకీయం అంటేనే వ్యూహం.. ఆ వ్యూహంలో ప్రతివ్యూహం ఉండాలి. కానీ బీఆర్ఎస్ పార్టీ వ్యూహం మాత్రం ప్రస్తుతం "పులి వేషం వేసి పిల్లిలా పలకరించినట్టు" తయారైంది. ఏ ఎన్నిక వచ్చినా "ఢీ అంటే ఢీ" అని తొడకొట్టడం.. తీరా సమయం వచ్చేసరికి "అబ్బే.. మాకు ఆసక్తి లేదు" అని చేతులెత్తేయడం గులాబీ బాసులకు అలవాటుగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో తగిలిన దెబ్బ మర్చిపోకముందే తాజాగా రాజ్యసభ ఎన్నికల రూపంలో మరో 'షాక్' తగిలింది. అసెంబ్లీలో సంఖ్యాబలం లేకపోయినా, బయట మాత్రం "అభిషేక్ సింఘ్వీని అడ్డుకుంటాం.. ఫిరాయింపుదారులకు విప్ జారీ చేస్తాం.. రాజకీయం అంటే చూపిస్తాం" అంటూ కేటీఆర్, హరీష్ రావు ఊదరగొట్టారు. తీరా చూస్తే కాంగ్రెస్ నుంచి సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి రాజసం ఉట్టిపడేలా నామినేషన్లు వేశారు. మరి మన బీఆర్ఎస్ అభ్యర్థి ఎక్కడయ్యా అంటే.. "వెతుకులాటలో ఉన్నాం" అని సమాధానం వస్తోందిగులాబీ బాస్ కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఉండి అప్పుడప్పుడు ఇచ్చే స్టేట్‌మెంట్లు కార్యకర్తల్లో జోష్ నింపుతాయని అనుకుంటే అవి కాస్తా "గాలి తీసిన బెలూన్"లా మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో కేటీఆర్, హరీష్ రావులు ఎంతగా కష్టపడుతున్నా, ప్రజలు మాత్రం "అధికారం ఉన్నప్పుడేమో బయటకి రాలేదు.. ఇప్పుడు మాత్రం ఫాంహౌస్ దాటి వస్తున్నారా?" అని సెటైర్లు వేస్తున్నారు."మేము పోటీ చేస్తాం.. గెలుస్తాం" అని ఆశావహులకు ఆశలు చూపించడం.. వాళ్లు కోట్లు ఖర్చు పెట్టుకోవడానికి రెడీ అయ్యాక, "వ్యూహాత్మకంగా తప్పుకుంటున్నాం" అని ప్లేటు తిప్పేయడం బీఆర్ఎస్ మార్క్ అయిపోయింది.ప్రస్తుతం బీఆర్ఎస్ కేడర్ పరిస్థితి 'ముందు నుయ్యి వెనుక గొయ్యి'లా మారింది. అధిష్టానం చెప్పే మాటలు వింటేనేమో అతివిశ్వాసం కనిపిస్తోంది.. రిజల్ట్స్ చూస్తేనేమో అట్టడుగున ఉంటున్నారు. "కాంగ్రెస్ పరువు తీస్తాం" అని వెళ్తే చివరకు సొంత పార్టీ పరువు కాపాడుకోవడమే గగనమైపోతోంది.రాజ్యసభ ఎన్నికల నుంచి తప్పుకోవడం ద్వారా "మా దగ్గర బలం లేదు" అని బీఆర్ఎస్ అఫీషియల్‌గా ఒప్పేసుకున్నట్లయింది. మరి ఈ 'మేకపోతు గాంభీర్యం' ప్రదర్శిస్తూ వచ్చే ఎన్నికల నాటికి బీజేపీకి బీ-టీమ్ అవుతారో లేక నిజంగానే మళ్లీ పుంజుకుంటారో చూడాలి. ప్రస్తుతానికి మాత్రం తెలంగాణ పాలిటిక్స్‌లో కాంగ్రెస్ 'హస్తం' పైచేయి సాధిస్తుంటే కారు మాత్రం రివర్స్ గేర్‌లో వెళ్తోంది!

# అవిశ్వాసం ఎటు పోతుందో...

విజయవాడ, మార్చి 6, (న్యూస్ పల్స్)

ఏపీల శాసనమండలి చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు రంగం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. శాసనసభకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గైర్హాజరవుతూ వస్తోంది. శాసనమండలిలో మాత్రం సంఖ్యా బలం ఉండడంతో గట్టి ప్రతాపమే చూపుతోంది. ఆ పార్టీకి చెందిన మోసేన్ రాజు మండలి చైర్మన్ గా ఉండడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రాధాన్యం దక్కుతోంది. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు చేయని ప్రయత్నం అంటూ లేదు. అయితే ఈ క్రమంలో ప్రభుత్వాన్ని నియంత్రిస్తూనే వైసీపీ సభ్యులకు సభలో అవకాశం ఇస్తున్నారు అన్నది చైర్మన్ మోసేన్ రాజు పై ఉన్న ఆరోపణ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తుండడంతో ఎలాగైనా మండలి చైర్మన్ ను దించేయాలని కూటమి భావిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది.అయితే నేరుగా కూటమి అవిశ్వాస తీర్మానం పెడితే రాజకీయంగా చెడ్డ పేరు వస్తుందని భావించి? తమ చేతికి మట్టి అంటకుండా ఆ అయిదుగురు ఎమ్మెల్సీలతో అవిశ్వాస తీర్మానం పెట్టించాలని కూటమి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏడాదిన్నర కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓ ఐదుగురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. అయితే వారి రాజీనామాలను ఆమోదిస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి శాసనమండలిలో బలం తగ్గిపోతుంది. అందుకే చైర్మన్ వారి రాజీనామాలను ఆమోదించకుండా తీవ్ర జాప్యం చేస్తూ వస్తున్నారు. అయితే ఆ ఎమ్మెల్సీ లంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు మండలి చైర్మన్ వారి వాదనలను తాజాగా విన్నారు. అయితే ఏ నిర్ణయం తీసుకోలేదు. అందుకే అవిశ్వాసం పెట్టేందుకు ఆ ఐదుగురు ఎమ్మెల్సీలు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.శాసనమండలిలో సంఖ్యాపరంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన బలం ఉంది. ఆ పార్టీకి ప్రస్తుతం 32 మంది ఎమ్మెల్సీల బలం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అందులో ఓ ఐదుగురు రాజీనామా చేయగా ఆమోదానికి నోచుకోలేదు. అయితే ఎక్కడ అనర్హత వేటు పడుతుందోనని చాలామంది ఎమ్మెల్సీలు వెనక్కి తగ్గుతున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఈ ఐదుగురు ఎమ్మెల్సీలతో పాటు మరికొందరు టిడిపి కూటమి వైపు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అందుకే ఈ ఐదుగురితో అవిశ్వాస తీర్మానం పెట్టించి.. మండలి చైర్మన్ ను గద్దె దించితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇవ్వొచ్చు అన్నది కూటమి ఆలోచన. అయితే వైసీపీకి చెందిన ఒకరిద్దరు బలమైన ఎమ్మెల్సీలను తమ వైపు తిప్పుకునేందుకు కూటమి ప్రయత్నాల్లో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. రాజకీయ ఆర్థిక ప్రయోజనాలతో ఒకరిద్దరు ఎమ్మెల్సీలు వైసీపీకి గుడ్ బై చెబుతారని ప్రచారం నడుస్తోంది. ఒకవేళ మండలి చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గితే.. ఏపీ రాజకీయాల్లో ఒక సంచలనమే. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# రాజ్యసభకు ఇవాళ నితీష్, రేపు చంద్రబాబేనా?



విజయవాడ, మార్చి 6,

బీహార్ రాజకీయాల్లో అజేయుడిగా నిలిచిన నితీష్ కుమార్, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకోవడం భారత రాజకీయాల్లో ఒక కీలక మలుపు. రాజ్యసభ ఎన్నికల్లో ఆయన స్వయంగా నామినేషన్ దాఖలు చేయడంతో, బీహార్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడబోతోందనేది స్పష్టమైంది. ఏపీలో కూడా జూన్ లోపు నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు ఉండటంతో.. నెక్ట్స్ చంద్రబాబు కూడా ఢిల్లీకి వెళ్తారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి.చంద్రబాబు నాయుడుకు ప్రస్తుతం 75 ఏళ్లు. నితీష్ కుమార్ కూడా దాదాపు అదే వయస్సులో ఉండటంతో ఈ పోలిక సహజంగానే వస్తోంది. ఏపీలో గత కొంతకాలంగా లోకేష్ ఎలివేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. క్యాబినెట్ సమావేశాల్లో లోకేష్ ప్రాధాన్యత పెరగడం, ముఖ్యమైన శాఖల నిర్వహణ, విదేశీ పర్యటనల్లో రాష్ట్ర ముఖచిత్రంగా మారడం చూస్తుంటే.. ఆయనను సీఎం పీఠంపై కూర్చోబెట్టి బాబు కేంద్రానికి వెళ్తారనే చర్చకు బలం చేకూరుస్తోంది. అయితే, నితీష్ లాగా చంద్రబాబుకు ఇది విశ్రాంతి సమయం కాకపోవచ్చు.బీహార్, ఏపీల మధ్య ఉన్న అతిపెద్ద వ్యత్యాసం బీజేపీ బలం . బీహార్‌లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది, నితీష్ కుమార్ పార్టీ ( జూనియర్ భాగస్వామిగా మారింది. అక్కడ నితీష్ వైదొలగడం బీజేపీకి అనివార్యమైన అవసరం. కానీ ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి భిన్నం. ఇక్కడ బీజేపీ ఒక మైనర్ పార్టీ. చంద్రబాబు నాయుడు కేవలం ముఖ్యమంత్రి మాత్రమే కాదు, కూటమికి అసలైన సారథి. బాబు లేకుండా ఏపీలో కూటమి మనుగడ కష్టమని బీజేపీకి కూడా తెలుసని భావిస్తున్నారు. నితీష్ కుమార్ ఇటీవలి కాలంలో కొన్ని ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. విచిత్రంగా ప్రవర్తిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీనికి భిన్నంగా చంద్రబాబు నాయుడు 75 ఏళ్ల వయస్సులోనూ అత్యంత చురుకుగా పనిచేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పాలనాపరమైన సమీక్షలు, జిల్లాల పర్యటనలతో ఆయన బిజీగా ఉంటున్నారు. ప్రస్తుతం ఆయనకు ఎటువంటి ఆరోగ్య ఇబ్బందులు లేకపోవడం, ఆయన తన పదవిని వదులుకునే అవకాశం లేదని స్పష్టం చేస్తోంది. చంద్రబాబు నాయుడుకు ఢిల్లీ రాజకీయాలంటే ఎప్పుడూ ఒక రకమైన విముఖత ఉంది. 1996లోనే ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా కాదనుకుని రాష్ట్ర రాజకీయాలకే పరిమితమైన చరిత్ర ఆయనది. ప్రస్తుత పరిస్థితుల్లో అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి చేయడం ఆయన కలలు. ఇవి ఇంకా ఒక కొలిక్కి రాకుండా ఆయన ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి తప్పుకుంటారన్నది ఊహించలేం. నితీష్ కుమార్ లాగా అన్ని సభల్లో సభ్యుడిగా ఉండాలి అనే వ్యక్తిగత మైలురాళ్ల కంటే, రాష్ట్ర పునర్నిర్మాణమే బాబు ప్రాధాన్యత.లోకేష్ ముఖ్యమంత్రి అవుతారనే చర్చ నిజమే అయినప్పటికీ, అది చంద్రబాబును ఢిల్లీకి పంపడం ద్వారా జరుగుతుందా అనేది అనుమానమే. చంద్రబాబు కనీసం 2029 వరకు ముఖ్యమంత్రిగా ఉండి, పాలనలో లోకేష్‌కు పూర్తి పట్టు వచ్చాక, పార్టీ శ్రేణులు , కూటమి భాగస్వామి పవన్ కళ్యాణ్ అంగీకారంతోనే మార్పు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ అనిశ్చితిలో బాబు తప్పుకుంటే అది కూటమికి నష్టం చేస్తుందనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

# దటీజ్ రేవంత్

హైదరాబాద్, మార్చి 6,

తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి తన రాజకీయ చాణక్యాన్ని, అధిష్టానం వద్ద తనకున్న తిరుగులేని పట్టును నిరూపించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ వంటి మహా సముద్రంలో ఎందరో సీనియర్ తిమింగలాల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, తన అత్యంత సన్నిహితుడు వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ బెర్త్ ఖరారు చేయించుకోవడంలో ఆయన సక్సెస్




అయ్యారు. ఇది కేవలం ఒక సీటు కేటాయింపు మాత్రమే కాదు, ఢిల్లీ పీఠంపై రేవంత్ ముద్ర ఏ స్థాయిలో ఉందో చాటిచెప్పే పరిణామం.కాంగ్రెస్ పార్టీలో ఒక సామెత ఉంది ? "ఢిల్లీలో చక్రం తిప్పడం అందరికీ సాధ్యం కాదు" అని. కానీ రేవంత్ రెడ్డి ఆ సామెతను తిరగరాస్తున్నారు. తాజాగా రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో రేవంత్ రెడ్డి తన పంతాన్ని నెగ్గించుకోవడం ద్వారా పార్టీలో తనదే 'పైచేయి' అని స్పష్టం చేశారు. దాదాపు 16 మంది సీనియర్ నేతలు రాజ్యసభ రేసులో పోటీ పడినా, అంతిమంగా ముఖ్యమంత్రి తన మిత్రుడు వేం నరేందర్ రెడ్డి వైపే అధిష్టానాన్ని మొగ్గు చూపేలా చేయగలిగారు.వి. హనుమంతరావు, జీవన్ రెడ్డి, కుసుమ కుమార్ వంటి హేమాహేమీలు ఈ సీటు కోసం తీవ్రంగా శ్రమించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లి కుసుమ కుమార్ లేదా వీహెచ్ పేర్లను ప్రతిపాదించి చక్రం తిప్పాలని చూశారు. మరోవైపు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దరఖాస్తుల కట్టలతో అధిష్టానం చుట్టూ తిరిగారు. కానీ, రేవంత్ రెడ్డి వ్యూహం ముందు ఇవేవీ పారలేదు. ఇటీవల రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చినప్పుడు ఈ విషయంపై దాటవేత ధోరణి ప్రదర్శించడం వెనుక ఉన్న మర్మం.. రేవంత్ రెడ్డితో చర్చించాకే తుది నిర్ణయం తీసుకోవాలనే సంకేతమే అని ఇప్పుడు స్పష్టమవుతోంది.వేం నరేందర్ రెడ్డి, రేవంత్ రెడ్డిల స్నేహం దశాబ్దాల నాటిది. జడ్పీటీసీ స్థాయి నుంచి మొదలైన వీరి ప్రస్థానం టీడీపీ, బీఆర్ఎస్ మీదుగా కాంగ్రెస్ వరకు కొనసాగింది. రేవంత్ రెడ్డి కష్టాల్లో ఉన్నప్పుడు, రాజకీయ సంక్షోభాల్లో ఉన్నప్పుడు నరేందర్ రెడ్డి వెన్నుదన్నుగా నిలిచారు. ప్రస్తుతం సీఎం పేషీలో కీలక వ్యక్తిగా, ప్రభుత్వ సలహాదారుగా ఉన్న నరేందర్ రెడ్డిని ఢిల్లీకి పంపడం ద్వారా, అక్కడ తనకంటూ ఒక నమ్మకస్తుడైన ప్రతినిధి ఉండాలని రేవంత్ భావించారు. ప్రభుత్వానికి సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయించుకోవడానికి ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుంది. ఈ పరిణామాన్ని దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలంతో పోలిస్తే రేవంత్ వేగం ఆశ్చర్యపరుస్తుంది. వైఎస్సార్ తన ఆత్మబంధువు కేవీపీ రామచంద్రరావుకు రాజ్యసభ సీటు ఇప్పించుకోవడానికి ఐదేళ్లు వేచి చూడాల్సి వచ్చింది. కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల లోపే తన మిత్రుడిని రాజ్యసభకు పంపగలిగారు. నాడు కేంద్రంలో కాంగ్రెస్ బలంగా ఉండటం వల్ల వైఎస్సార్‌కు కొంత పరిమితులు ఉండేవి, కానీ నేడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న తరుణంలో.. తెలంగాణ లాంటి రాష్ట్రం నుంచి పార్టీని బలోపేతం చేస్తున్న రేవంత్ మాటకు అధిష్టానం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.ఇటీవల ఏఐ డీప్ ఫేక్ వీడియోల ద్వారా రేవంత్ రెడ్డిని అధిష్టానం దూరం పెడుతోందని, ఖర్గే ఆయన్ని దగ్గరకు రానివ్వడం లేదని జరిగిన దుష్ప్రచారానికి ఈ నిర్ణయం ఒక గట్టి సమాధానం. ఢిల్లీలో ఒక సీటునుఅభిషేక్ మను సింఘ్వీ వంటి మేధావికి కేటాయించి, మరో సీటును తన మిత్రుడికి దక్కించుకోవడం ద్వారా రేవంత్ తన బలాన్ని నిరూపించుకున్నారు.వరుసగా వచ్చే రాష్ట్రాల ఎన్నికలు, ముఖ్యంగా కేరళ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి అందుతున్న సహకారం, రేవంత్ పనితీరు పట్ల రాహుల్ గాంధీకి ఉన్న నమ్మకం వెరసి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ కింగ్ గా మార్చాయి. ఎన్ని ఫిర్యాదులు, ఎంతమంది సీనియర్ల అసంతృప్తులు ఉన్నా.. విజేతగా నిలవడం రేవంత్ స్టైల్ అని మరోసారి రుజువైంది.

# హఠాత్తుగా ఆనంద బోస్ రాజీనామా

కోల్ కత్తా, మార్చి 6,

పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి. ఆనంద బోస్ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, రాష్ట్రపతికి తన రాజీనామా లేఖను సమర్పించారు. 2022 నవంబర్‌లో బాధ్యతలు చేపట్టిన ఆయన, సుమారు మూడున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగారు. రాజీనామా అనంతరం ఆయన స్పందిస్తూ, గవర్నర్ కార్యాలయంలో నేను తగినంత సమయం గడిపాను అని క్లుప్తంగా వ్యాఖ్యానించారు. అయితే, రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల తరుణంలో ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక లోతైన రాజకీయ కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.ఆనంద బోస్ పదవీకాలం మొదటి నుంచి అధికార తృణమూల్ కాంగ్రెస్‌తో విభేదాలతోనే సాగింది. ముఖ్యంగా యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, పంచాయతీ ఎన్నికల హింస వంటి అంశాలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ఆయన నేరుగా తలపడ్డారు. ప్రభుత్వం పంపిన పలు బిల్లులను పక్కన పెట్టడం ద్వారా ఆయన రాజ్‌భవన్‌ను ఒక సమాంతర ప్రభుత్వంలా నడుపుతున్నారని టీఎంసీ నేతలు తీవ్రంగా విమర్శించేవారు. ఈ క్రమంలో మమతా బెనర్జీపై ఆయన పరువు నష్టం దావా కూడా వేయడం రాజకీయంగా పెను దుమారం రేపింది.ఆనంద బోస్ పదవిలో ఉండగానే అత్యంత వివాదాస్పదమైన లైంగిక వేధింపుల ఆరోపణలను ఎదుర్కోవాల్సి వచ్చింది. 2024 మే నెలలో రాజ్‌భవన్‌కు చెందిన ఓ తాత్కాలిక మహిళా ఉద్యోగిని, గవర్నర్ తనను వేధించారని కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై మమతా బెనర్జీ స్పందిస్తూ, రాజ్‌భవన్‌లో మహిళలకు భద్రత లేదు అని ఘాటుగా విమర్శించారు. దీనికి ప్రతిగా గవర్నర్ తన నిజాయితీని నిరూపించుకోవడానికి రాజ్‌భవన్ సీసీటీవీ ఫుటేజీని బహిరంగంగా ప్రదర్శించి ఆరోపణలను ఖండించినప్పటికీ, ఆ మచ్చ ఆయన పదవీకాలాన్ని వెంటాడింది.



బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న తరుణంలో ఆనంద బోస్ నిష్క్రమణ ప్రాధాన్యత సంతరించుకుంది. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూనే రాజకీయంగా తీవ్ర విమర్శలు ఎదుర్కోవడం, మరోవైపు కేంద్రం పంపే కొత్త గవర్నర్ ఎవరనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మమతా బెనర్జీ ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి పెంచుతూ వచ్చిన ఆనంద బోస్, పదవికి దూరమవ్వడం టీఎంసీకి కొంత ఊరటనిచ్చే అంశమైనప్పటికీ, ఎన్నికల వ్యూహాల్లో ఇది ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

# పంచాయతీల్లో కొత్త సర్పంచ్ ఎబ పాత సర్పంచ్

వరంగల్, మార్చి 6


తెలంగాణ పంచాయతీల్లో కొత్త పంచాయితీలు నెలకొంటున్నాయి. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి పాత సర్పంచ్‌లు, కొత్త సర్పంచ్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంటోంది. తాము అప్పులు తెచ్చి డబ్బులు ఖర్చు పెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని.. కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చిన నిధులను పెండింగ్ బిల్లులు చెల్లింపుల కింద ఇవ్వాలని పాత సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులకే నిధులన్నీ అయితే అభివృద్ధి ఏం చేయాలంటూ కొత్త సర్పంచ్‌లు తలలు పట్టుకుంటున్నారు.తెలంగాణలో దాదాపు 2 ఏళ్ల ఆలస్యంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. జనవరి నెలలోనే గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పడి.. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లతో పాలన సాగుతోంది. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం చేయడంతో.. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచింది. ఎన్నికలు పూర్తి అయిన తర్వాత మాత్రమే వాటిని రిలీజ్ చేస్తామని తేల్చి చెప్పింది. దీంతో ఇటీవల ఎన్నికలు పూర్తై గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు వచ్చిన తర్వాత.. దశల వారీగా 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేస్తోంది. అదే సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను కేటాయిస్తోంది. ఇక్కడే ఇప్పుడు అసలు సమస్య మొదలైందిపలు విడతల్లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 1,034 కోట్ల నిధులను ఇటీవలె విడుదల చేసింది. ఇప్పుడు ఈ నిధుల గురించే.. కొత్త సర్పంచ్‌లు, పాత సర్పంచ్‌లకు మధ్య తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తాము గతంలో సర్పంచ్ హోదాలో గ్రామాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పించామని.. వైకుంఠధామాలు, డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనులు చేసినట్లు పాత సర్పంచులు చెబుతున్నారు. ఆ పనులకు అప్పట్లో బిల్లులు రాకపోవడంతోతీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుపోతున్నాయని పాత సర్పంచ్‌లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాపు రూ.1,000 కోట్లకు పైగా పాత బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన నిధులపై తమకే హక్కు ఉంటుందని తేల్చి చెబుతున్నారు. ఇక.. కొత్త సర్పంచ్‌లు మాత్రం వాటికి ససేమిరా అనడంతో అసలు వివాదం మొదలైంది. తాము పంచాయతీ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి, గ్రామాలను డెవలప్ చేస్తామని ప్రజలకు మాట ఇచ్చామని.. ఇప్పటివరకు వచ్చిన నిధులు మొత్తాన్ని పాత బకాయిలకే చెల్లిస్తే.. ఇక గ్రామాల్లో అభివృద్ధి ఎలా చేయాలంటూ ప్రశ్నిస్తున్నారుతాము అధికారంలోకి వచ్చీ రాగానే.. కేంద్రం నుంచి విడుదలైన నిధులను ఇవ్వకపోతే.. ఇక గ్రామ పంచాయతీలను ఎలా నడపాలంటూ ప్రశ్నిస్తున్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడం కోసం కొత్త పనులు ప్రారంభించకుండా కేవలం పెండింగ్ బకాయిలు తీర్చడానికే తాము కొత్తగా పదవుల్లోకి వచ్చామా అంటూ కొత్త సర్పంచ్‌లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.పెండింగ్ నిధుల్లో కేంద్రం కొంత మాత్రమే విడుదల చేయడం.. అందులో చాలా వరకు పాత బకాయిలు చెల్లించడానికే ఉపయోగించడం వల్ల.. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, స్ట్రీట్ లైట్స్ వంటి అత్యవసర పనులు చేసేందుకు కూడా నిధులు లేకుండా పోతున్నాయని కొత్త సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని.. కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న మిగతా నిధులను కూడా త్వరగా విడుదలయ్యేలా చూడాలని తెలంగాణ గ్రామ సర్పంచుల సంఘం విజ్ఞప్తి చేస్తోంది.నిధుల విషయంలో కొత్త, పాత సర్పంచ్‌ల విషయంలో ఈ ఉద్రిక్తత తలెత్తడంతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన తాగునీరు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను.. తాజాగా విడుదలైన నిధుల నుంచి చెల్లించాలని మంత్రి సీతక్క స్పష్టం చేసింది. అదే సమయంలో పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధుల్లో నుంచి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని సూచించారు.

# క్యూర్- ప్యూర్ రీజియన్ల అడుగులు

హైదరాబాద్ మార్చి 6,

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య 1.10 లక్షల ఎకరాల్లో భారీ గ్రీన్‌బెల్ట్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనిని 110 హరిత జోన్లుగా విభజించి ఆక్వా, అగ్రి బిజినెస్‌లను ప్రోత్సహించనుంది. రూ. 35 వేల కోట్లతో నిర్మిస్తున్న 340 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు ద్వారా 24 అర్బన్ క్లస్టర్లను అనుసంధానిస్తూ, కాలుష్య రహిత అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా.. క్యూర్.. ప్యూర్.. రేర్ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది. క్యూర్- ప్యూర్ రీజియన్ల మధ్యలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీని పరిధిలో అందుబాటులోకి వచ్చే లక్షా పది వేల ఎకరాల భూముల్లో చెరువులతో పాటు ఆక్వా కల్చర్, అగ్రి బిజినెస్ వంటి వ్యాపారాలను చేయవచ్చు. ఈ భూములను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కానీ.. ప్రైవేటు, కార్పొరేటు సంస్థలకు లీజుకివ్వడం ద్వారా గానీ గ్రీనరీని పెంపొందించి ఆర్ఆర్ఆర్ లోపల భాగంలో సకాలంలో వర్షాలు కురిసేలా చర్యలు తీసుకోనున్నారు.ఓఆర్ఆర్ చుట్టూ ప్రస్తుతం అంతగా గ్రీన్‌బెల్ట్ లేకపోవడం, ఇండ్లు, పరిశ్రమలు పెరుగుతుండడంతో కాలుష్యం పెరుగుతుందని చెబుతున్నారు. ఓఆర్ఆర్- ఆర్ఆర్ఆర్ మధ్యలో గ్రీన్‌బెల్ట్ వల్ల ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్య 110 ప్రాంతాలను హరిత జోన్లుగా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రీన్‌బెల్ట్‌కు కేటాయించనున్న 1.10లక్షల ఎకరాలను 110 గ్రీన్‌జోన్లుగా విభజించనున్నారు. ఇలా విభజిస్తే.. ప్రతి 3.5 కిలోమీటర్లకు ఒక హరిత జోన్ ఏర్పాటు కానుంది. ఇందులో ఆక్వా, అగ్రి బిజినెస్, చెట్లతో ప్రతి జోన్ ప్రాణవాయువు కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.ఇక రీజినల్ రింగు రోడ్డును రూ. 35 వేల కోట్ల వ్యయంతో 340 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్నారు. 24 అర్బన్ క్లస్టర్లు, 208 గ్రామాలను కనెక్ట్ చేస్తున్నారు. దక్షిణ తెలంగాణ పరిధిలో 182 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ రింగ్‌రోడ్డు ప్రధాన రహదారిగా మారనుంది. ఔటర్ రింగు రోడ్డుతో పాటు చౌటుప్పల్, శివన్నగూడ, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి మీదుగా వెళ్లనుంది. ఉత్తర తెలంగాణ పరిధిలో 158 కి. మీ మేర ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వద్ద ఈ రోడ్డు కలుస్తుంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి.

# మినీ మాల్దీవులుగా .. కృష్ణా నది బ్యాక్ వాటర్స్



మహబూబ్ నగర్ మార్చి 6

వీకెండ్‌లో ఎక్కడికైనా ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా.. వరుస సెలవుల్లో మాల్దీవులు లాంటి ప్రదేశాలకు వెళ్లాలని అనుకుంటున్నారు.. తెలుగు రాష్ట్రాలు దాటి ఎక్కడికి వెళ్లినా ఖర్చుతో కూడుకున్న యాత్రే అవుతుంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉండే వారు తక్కువ బడ్జెట్‌లో మాల్దీవులను చూసి ఫీలింగ్ పొందడానికి ఓ ఆహ్లాదకరమైన ప్రదేశం ఉంది. అదే తెలంగాణ మినీ మాల్దీవులు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన సోమశిలను తెలంగాణ మినీ మాల్దీవులుగా పిలుస్తారు. జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక ప్రాంతంగా సోమశిలకు అవార్డు కూడా దక్కింది.కృష్ణా నది బ్యాక్ వాటర్స్ అందాలతో ముస్తాబైన ఈ ప్రాంతం, ఇప్పుడు పర్యాటకులకు మినీ మాల్దీవులుగా మారిపోయింది. నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ సమీపంలో ఉన్న సోమశిల గ్రామం వద్ద కృష్ణా నది ఒక సముద్రాన్ని తలపిస్తుంది. శ్రీశైలం డ్యామ్ బ్యాక్ వాటర్స్ ఇక్కడ భారీ జలాశయంగా కనిపిస్తాయి. నల్లమల అటవీ శ్రేణుల మధ్యలో ఈ నీటి ప్రవాహం పర్యాటకులను మంత్రముగ్దులను చేస్తోంది. నగర జీవన ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలనుకునే వారికి సోమశిల ఒక ఫర్ఫెక్ట్ డెస్టినేషన్ అని చెప్పొచ్చు.సోమశిల ప్రాంతాన్ని పర్యాటకులను మంత్రముగ్దులను చేసేలా తీర్చిదిద్దారు. ఒక్కసారి ఈ ప్రాంతాన్ని సందర్శిస్తే.. మళ్లీమళ్లీ రావాలనిపించేలా ఈ ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులు కల్పించారు. నది తీరాన నిర్మించిన హరిత రిసార్ట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. నదికి ఎదురుగా ఉండే కాటేజీల కిటికీల నుంచి చూస్తే నీటి అలలు పాదాలను తాకుతున్నాయా..? అన్నంత దగ్గరగా ప్రకృతి కనిపిస్తుంది. ఇక్కడ బోటింగ్ ప్రయాణం అత్యంత సాహసోపేతంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. కొండల మధ్య నీటిలో పడవలో ప్రయాణిస్తుంటే తియ్యని అనుభూతి కలుగుతుంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న క్రూయిజ్ బోట్లు పర్యాటకులను అద్దాల మర్రి వంటి సమీప ప్రాంతాలకు తీసుకెళ్తాయి.సోమశిల కేవలం విహారయాత్రకే పరిమితం కాదు.. ఆధ్యాత్మిక ప్రాంతం కూడా. ఇక్కడ వ శతాబ్దానికి చెందిన సుప్రసిద్ధ శ్రీ లలిత సోమేశ్వర స్వామి దేవాలయం కూడా ఉంది. 12 జ్యోతిర్లింగాలకు ప్రతీకగా ఇక్కడ 12 శివలింగాలు కొలువై ఉండటం విశేషం. ప్రతీ సంవత్సరం పుష్య బహుళ అమావాస్య రోజున ఇక్కడ జరిగే జాతరకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. కృష్ణా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు.సోమశిల ప్రాంతం హైదరాబాద్ నుంచి సుమారు 170 నుంచి 180 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సొంత వాహనాల్లో వచ్చేవారు కొల్లాపూర్ మీదుగా ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో విదేశీ పర్యాటక అనుభూతిని పొందవచ్చునని ఇక్కడికి వచ్చే పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీకెండ్స్‌లో పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉండడంతో హరిత రిసార్ట్స్‌లో బస చేయాలనుకునేవారు ముందుగానే ఆన్‌లైన్ బుక్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# సంక్షేమ పథకాల్లో పారదర్శకత- సాంకేతికతతో అక్రమాలకు చెక్

హైదరాబాద్, మార్చి 6,

తెలంగాణలో పాలనా యంత్రాంగాన్ని మరింత చైతన్యవంతం చేస్తూ, ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ఒక సమగ్రమైన రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, సర్పంచుల నుంచి మేయర్ల వరకు ప్రతి ప్రజాప్రతినిధిని భాగస్వాములను చేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కేవలం అధికార యంత్రాంగమే కాకుండా, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైనప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం భావిస్తోంది. దీని కోసం జిల్లా కేంద్రాల్లో ప్రజాప్రతినిధులకు వారి విధులు, బాధ్యతలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, అవసరమైన సమాచారాన్ని ప్రింటెడ్ మెటీరియల్ రూపంలో అందజేయనున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకే అందాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికత ప్రతి పథకంలో ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆసరా పింఛన్లలో ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆసరా పింఛన్లలో ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా సుమారు 3 లక్షల మంది అనర్హులను తొలగించింది ప్రభుత్వం. సాంకేతికతను సక్రమంగా వినియోగించుకపోవడం వల్ల గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుతూ, అర్హులైన ప్రతి పేదవాడికి న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గ్రామ, వార్డు సభల్లో నూతనంగా మంజూరు చేసిన రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు రుణ మాఫీ వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను బహిరంగంగా వెల్లడించాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు కలుగుతున్న లబ్ధిని లెక్కలతో సహా వివరించడం ద్వారా పాలనలో జవాబుదారితనం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సంప్రదాయం నుంచి ఆధునికతవైపు తెలంగాణ అన్నదాతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ముఖ్యంగా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. వ్యవసాయ పంప్‌సెట్‌ల స్థానంలో సోలార్ పంప్ సెట్? వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని, ఇళ్లపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఆదాయం పొందే మార్గాలపై అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖకు సూచించారు. వ్యవసాయం శాఖ కేవలం విత్తనాలు, ఎరువులు పంపిణీకే పరిమితం కాకుండా శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని సకాలంలో రైతులకు అందించే, ఏ నేలలో ఏ పంట వేస్తే లాభదాయకమో సూచించాలని ఆదేశించారు. యూరియా యాప్‌లో ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించి, నానో యూరియా వినియోగాన్ని క్షేత్రస్థాయి ప్రదర్శనల ద్వారా రైతులకు చేరువ చేయాలని నిర్ణయించారు. నాణ్యమైన సేవల దిశగా రాష్ట్రంలోని ప్రభుత్వం వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను స్థానిక పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలతో అనుసంధానం చేయనున్నారు. మెడికల్ కాలేజీల్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులైన వైద్యులు, ప్రొఫెసర్ల సేవలు సామాన్య ప్రజలకు కూడా అందేలా రిఫరల్ విధానాన్ని బలోపేతం చేయాలని సీఎం ఆదేశించారు. విద్యా రంగంలో సంస్కరణలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈ-సిగరెట్ల వినియోగాన్ని అరికట్టే బాధ్యతను విద్యాసంస్థల యాజమాన్యాలకే అప్పగించారు. విద్యార్థుల మానసిక స్థితిని గమనిస్తూ వారికి సరైన మార్గదర్శనం చేసేందుకు ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలో సైకాలజిస్ట్‌లను నియమించడం తప్పనిసరి చేయనున్నారు. మరోవైపు మధ్యాహ్నం భోజన పథంలో ఎక్కడా అంతరాయం కలగకుండా ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు చెల్లించాలని, విద్యార్థులకు పోషకాహారం అందేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.ప్రజాభద్రత, మౌలిక సదుపాయాలు రహదారి భద్రతకు పెద్దపీట వేస్తూ, రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారులపై గుంతలు, ప్రమాదకర ప్రాంతాల సమాచారం పంపేందుకు ఒక ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రజలు పంపేసమాచారం ఆధారంగా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. ఆర్టీసీ, సరకు రవాణా వాహనాల డ్రైవర్ల కోసం వారు నిరంతరం కలుసుకునే చోట్లే ఉచిత కంటి పరీక్షల శిబిరాలను నిర్వహించాలని రవాణా శాఖకు ఆదేశించారు. నగరాల్లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, విద్యార్థి హాస్టళ్లు భద్రత, అనుమతులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వాటి యాజమాన్యాలను జవాబుదారీ చేయాలని సూచించారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఓఆర్ఆర్ పరిసరాల్లో నిర్మాణ వ్యర్థాలను పారబోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏజెన్సీలను బాధ్యులను చేస్తూ జరిమానాలు విధించాలని ఆదేశించారు

====================చీచీ



# ఈటెల దారెటు

హైదరాబాద్, కరీంనగర్, మార్చి 6,

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి.. గులాబీ పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగిన ఈటెల రాజేందర్ అనివార్య పరిస్థితుల్లో అత్యంత అవమానకరంగా కారు పార్టీ నుంచి బయటికి వచ్చారు. ఆ తర్వాత కమలం పార్టీలో చేరారు. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, గజ్వేల్ నియోజకవర్గాలలో పోటీ చేసి ఓడిపోయారు. 2024 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్ గిరి స్థానం నుంచి ఎంపీగా గెలిచారు.కమలం పార్టీలో ఉంటున్నప్పటికీ ఈటల రాజేందర్ కు సముచితమైన స్థానం లభించడం లేదని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాజేందర్ గులాబీ గూటికి వెళ్తారని సోషల్ మీడియాలో ప్రచారం కూడా జరుగుతుంది. అయితే ఆయన కాంగ్రెస్ లోకి వెళ్లే ఛాన్స్ ఉందని మొన్నటిదాకా ప్రచార జరిగినప్పటికీ.. అలాంటి అవకాశం లేదని ఆయన మద్దతుదారులు అంటున్నారు. పురపాలక ఎన్నికల్లో ఆయన కేవలం మల్కాజి గిరి స్థానానికి మాత్రమే పరిమితం అయ్యారు. కరీంనగర్ లో జోక్యం చేసుకోకూడదని ఇప్పటికే ఆయనకు అధిష్టానం చెప్పినట్టు తెలుస్తోంది. స్టార్ క్యాంపెనర్ గా ఆయనకు అవకాశం కల్పించినప్పటికీ.. ఎక్కడికక్కడ బంధనాలు విధించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే మున్సిపల్ ఎన్నికల్లో తన వర్గాన్ని కాపాడుకోలేదనే భావన రాజేందర్ లో ఉందని ఆయన వర్గీయులు అంటున్నారు. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో హుజురాబాద్లో పట్టు కోసం రాజేందర్ ప్రయత్నించినట్టు తెలుస్తోంది.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తో ఈటల రాజేందర్ కు మధ్య ఉప్పు నిప్పు లాగా వ్యవహారం సాగుతోందని రాజకీయ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. ఆ మధ్య బండి సంజయ్.. ఈటల రాజేందర్ పరోక్షంగా విమర్శలు కూడా చేసుకున్నారు. రాజేందర్ అయితే తన స్వరాన్ని పెంచి పేరు చెప్పకుండా బండి సంజయ్ వర్గం మీద తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో వేలు పెడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.ఈ పరిణామాలు మొత్తం ఈటెల రాజేందర్ వర్గీయులలో అంతర్మథనానికి కారణమైనట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీలో ప్రాధాన్యం లేనప్పుడు.. గుర్తింపు ఇచ్చే పార్టీలోకి వెళ్లాలని ఈటెల రాజేందర్ మీద ఆయన అనుచరులు తీసుకొస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. సోషల్ మీడియాలో అయితే ఈటెల రాజేందర్ కు గులాబీ పార్టీ నుంచి ఆహ్వానాలు అందుతున్నట్టు తెలుస్తోంది. అందువల్లే ఈటల రాజేందర్ మౌనంగా ఉంటున్నట్టు తెలుస్తోంది.గతంలో బిజెపిలో చేరికల కమిటీ చైర్మన్ గా రాజేందర్ పనిచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఎంపిగా కూడా గెలిచారు. కానీ ఆయనకు కేంద్ర కేబినెట్లో చోటు లభించలేదు. దీనికి తోడు రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా ఆశించారు. అది కూడా ఆయనకు దక్కలేదు. రామచంద్రరావుకు బిజెపి స్టేట్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వడం రాజేందర్ లో అసహనాన్ని కలిగించిందని ఆయన వర్గీయులు చెబుతుంటారు. తన ఆవేదనను అమిత్ షా వంటి నేతలతో చెప్పుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని రాజేందర్ అనేక సందర్భాలలో తన అనుచరుల వద్ద వాపోయినట్టు తెలుస్తోంది.ఇటీవల స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకత్వం వ్యవహరించిన తీరు కూడా రాజేందర్ ను మనస్థాపానికి గురి చేసినట్టు సమాచారం. స్థానిక ఎన్నికల తర్వాత పార్టీలో రాజేందర్ అంత వ్యూహాత్మకంగా కనిపించడం లేదు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కీలకమైన నాయకుడిగా ఎదిగిన రాజేందర్.. ఇప్పుడు కేవలం మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానానికి పరిమితం కావడానికి ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ అధిష్టానం కావాలని ఇలా చేసిందా? వేరే వ్యక్తుల ఒత్తిడి వల్ల ఇలా చేస్తోందా? అనే ప్రశ్నలు కార్యకర్తల్లో వ్యక్తం అవుతున్నాయి.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న మున్సిపల్ ఎన్నికలకు దూరంగా ఉండాలని రాజేందర్ ను పార్టీ అధిష్టానం ఆదేశించడం మింగుడు పడని విధంగా ఉందని ఆయన వర్గీయులు అంటున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆయన వర్గీయులకు అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం కూడా రాజేందర్ ను మనస్థాపానికి గురి చేసినట్టు తెలుస్తోంది. స్టార్ క్యాంపెనర్ గా రాజేందర్ ను పేర్కొన్నప్పటికీ.. కరీంనగర్ జిల్లాలో వేలు పెట్టకూడదని చెప్పడం ఒకరకంగా ఆయన వేగానికి స్పీడ్ బ్రేకర్ వేయడం లాంటిదేనని కార్యకర్తలు అంటున్నారు. అధిష్టానం వైఖరితో రాజేందర్ సీరియస్ గా ఉన్నారని.. త్వరలోనే ఆయన వేరే నిర్ణయం తీసుకోబోతున్నారని తెలుస్తోంది.ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో తన వర్గీయులకు ప్రాధాన్యం దక్కకపోవడంతో వారంతా కూడా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున బరిలోకి దిగారు. దీనికి తోడు ఆ మధ్య సోషల్ మీడియాలో రాజేందర్ కు వ్యతిరేకంగా ప్రచారం జరిగింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే హుజురాబాద్ అసెంబ్లీ స్థానం ఉంటుంది. ఈ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రాజేందర్ అనేక పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు ప్రత్యేకమైన వర్గం కూడా ఉంది. బిజెపిలో రాజేందర్ చేరినప్పుడు వారు కూడా కాషాయం కండువా కప్పుకున్నారు. కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి గెలిచిన బండి సంజయ్ ప్రస్తుతం ఇక్కడ కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య కోల్డ్ వార్ ఉండేది. ఇప్పుడు ఆ గ్యాప్ మరింత పెరిగింది. వీరిద్దరి మధ్య సయోధ్య కుదరచడానికి అనేకమంది నేతలు ప్రయత్నించినప్పటికీ అంతగా సక్సెస్ కాలేదు.ఆమధ్య ఈటెల రాజేందర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కొంతమంది నేతలు హైదరాబాదులోని షామీర్పేట ప్రాంతంలో భేటీ అయినట్టు వార్తలు వస్తున్నాయి. వారందరికీ అండగా ఉంటానని బండి సంజయ్ హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే కొద్ది రోజులకే గ్రామపంచాయతీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో తన వర్గీయులను రాజేందర్ రంగంలోకి దింపారు. కొన్ని పంచాయతీలలో రెబల్ అభ్యర్థులుగా కూడా పోటీలో ఉంచారు.ఈ పరిణామాల నేపథ్యంలో ఈటల రాజేందర్ ను హుజురాబాద్ నియోజకవర్గం లోకి ప్రవేశించకుండా కేంద్ర మంత్రి బండి సంజయ్ వర్గం అడ్డుకున్నట్టు ప్రచారంలో ఉంది. ఈ పరిణామం రాజేందర్ ను ఇబ్బందికి గురి చేసిందని.. పార్టీ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో ఆయన నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. దీంతో మల్కాజి గిరి పార్లమెంటు స్థానానికే రాజేందర్ పరిమితమయ్యారు. ఇటీవల సోషల్ మీడియాలో రాజేందర్ మీద తీవ్రస్థాయిలో పోస్టులు కనిపిస్తున్నాయి. వాటిపై ఆయన స్పందించారు. అవన్నీ కూడా పిచ్చోళ్ళు పెట్టే పోస్టులని ఆయన వ్యాఖ్యానించారు.ఇక అప్పట్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ పీ ఆర్ ఓ ను ఉద్దేశించి రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో ఆ రాజేందర్ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. అంతేకాదు తాను ఏ పార్టీలో ఉన్నాననే విషయం ప్రజలు తేల్చుకుంటారని రాజేందర్ అన్నారు. సోషల్ మీడియా పోస్టులు ఆధారంగా రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదని రాజేందర్ పేర్కొన్నారు. అయితే ఆయనకు గులాబీ పార్టీ నుంచి ఆహ్వానం లభించిందని.. త్వరలోనే ఆయన ఆ పార్టీలో చేరబోతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# విధేయతకు పెద్ద పీట

మహబూబ్ నగర్, మార్చి 6,

కాంగ్రెస్ పార్టీలో ‘హైకమాండ్’ అంటే ఒకప్పుడు అది ఒక భయం, ఒక భక్తి. కానీ తెలంగాణలో మాత్రం ఇప్పుడు సీన్ మారింది. అప్పట్లో వైఎస్సార్ తన ఆత్మబంధువు కేవీపీ కోసం అధిష్ఠానాన్ని ఎలా ఒప్పించేవారో.. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే రూట్ మ్యాప్ ఫాలో అవుతున్నట్లు కనిపిస్తోంది.పాపం ప్రియాంక గాంధీ గారు ఎంతో ఆశగా వంశీచంద్ రెడ్డి పేరును సిఫార్సు చేశారట. “మా వంశీకి ఒక అవకాశం ఇవ్వండి” అని ఆమె కోరితే.. “లేదు మేడమ్, మా ‘వేం’ ఉంటేనే మాకు క్షేమం” అని రేవంత్ రెడ్డి మొండికేసినట్లు సమాచారం. మొత్తానికి అధిష్ఠానం పట్టును రేవంత్ తన ‘పట్టు’దలతో సడలించారు. ఢిల్లీ పెద్దల మాట నెగ్గకపోయినా, రేవంత్ మాట నెగ్గడంతో గాంధీ భవన్‌లో ఇప్పుడు కొత్త నినాదం వినిపిస్తోంది: “హైకమాండ్ ఇచ్చేది బి-ఫామ్ మాత్రమే.. అభ్యర్థిని తేల్చేది మాత్రం రేవంత్ అన్నే!”ఇక అభ్యర్థుల ఎంపిక చూస్తే.. కాంగ్రెస్ పార్టీకి కోర్టుల్లో కష్టమొచ్చినా, పొలిటికల్ కోర్టులో తలనెప్పి వచ్చినా గుర్తొచ్చే ఏకైక పేరు అభిషేక్ మను సింఘ్వీ. ఆయనకు సీటు ఇవ్వకపోతే కాంగ్రెస్ ఫైళ్లు కదిలేలా లేవు, అందుకే ఆయనకు మళ్ళీ ‘పెద్దల సభ’ టికెట్ ఖరారైంది. కానీ అసలు కిక్కు ఇచ్చింది మాత్రం వేం నరేందర్ రెడ్డి ఎంపికే!రేవంత్ రెడ్డి కష్టాల్లో ఉన్నా, కారాగారంలో ఉన్నా వెన్నంటి ఉన్నందుకు నరేందర్ రెడ్డికి ‘రాజ్య’యోగం పట్టింది. రెడ్డి కోటాకే పట్టం కట్టింది. “అన్నీ వేరే వాళ్ళకే ఇస్తున్నారు.. మా వాళ్ళ సంగతేంటి?” అని రేవంత్ వేసిన రెడ్డి కార్డు ముందు ప్రియాంక గాంధీ మార్కు పాలిటిక్స్ కూడా పని చేయలేదు.అసెంబ్లీలో ప్రతిపక్షం బిఆర్ఎస్ పరిస్థితి ‘సైలెంట్ మోడ్’లో ఉండటంతో కాంగ్రెస్ అభ్యర్థులకు పోలింగ్ అవసరం లేకుండానే గెలుపు ఖాయమైపోయింది. నామినేషన్ వేయడమే ఆలస్యం.. గెలుపు గుర్రాలు రెడీ!ఢిల్లీలో చక్రం తిప్పే పెద్దల ముందు, తెలంగాణ ‘రీజనల్’ చక్రం గట్టిగా తిరిగింది. వంశీచంద్ రెడ్డికి ప్రియాంక హస్తం ఉన్నా.. వేం నరేందర్ రెడ్డికి మాత్రం రేవంత్ ‘మస్తీ’ తోడైంది!

# శ్రీవారిని దర్శించుకున్న కవిత దంపతులు

తిరుమల మార్చి 6,

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం తన భర్త అనిల్ తో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమలకు చేరుకున్నారు.

కవిత మాట్లాడుతూ నేను నాలుగు సంవత్సరాలుగా పడుతున్న మనో వేదన స్వామి వారి దయతో తీరిపోయింది. సత్యం, న్యాయం , ధర్మం మావైపు ఉందని నేను చెప్తూ వచ్చాను.. స్వామి వారి దయతో కంప్లీట్ గా క్లీన్ చిట్ వచ్చింది.. అందుకే కాలినడకన వచ్చి స్వామివారికి మొక్కు చెల్లించుకున్నాను. తెలంగాణ ప్రజల పక్షాన తెలంగాణ ఇంటి పార్టీగా పని చేయడానికి రానున్న రోజుల్లో రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నాం.. ఆ పార్టీకి స్వామి వారి ఆశీస్సులు, దయ ఉండాలని కోరుకున్నాను. తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలని, బాగుండాలని కోరుకున్న.. తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలు, ప్రజలు బాగుండాలని స్వామి వారిని కోరుకున్నానని అన్నారు.



# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశం

## పాల్గొన్న మంత్రులు పొంగులేటి, వాకిటి

ఖమ్మం మార్చి 6,

ఖమ్మం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన 99 రోజుల ప్రజపాలన విజయవంతం చేయాలని కోరారు. ప్రజాపాలనతో పాటు ప్రగతి ప్రణాళిక సైతం అధికారులు రరూపొందించాలని ఆదేశాలు ఇచ్చారు. 99 రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా పని చేయాలి. అందరికి అర్ధమయ్యేలా ప్రణాళిక రూపందించుకోవాలి. ప్రతీ పేదవాడికి అన్నీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అన్నారు.

జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన యొక్క ముఖ్య ఉద్దేశం అందరికి తెలియపరచాలి. అధికారులు ఎక్కడా అలసత్వం చేయకుండా పనిచేయాలి. ప్రతీ ఇంటికి అన్నీ పథకాలు తెలిసేలా, చేరేలా చేరేవిధంగా పని చేయాలి. ప్రతీ పేద వాడికి సంక్షేమ పథకాలు చేరుతున్నాయా లేదా అనేది పరిశీలించాలి. పార్టీలకి అతీతంగా అర్హులైన పేదలకి అందేవిధంగా చూడాలని అన్నారు.

# మాదారం లో అంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం

పరిగి మార్చి 6,

వికారాబాద్ జిల్లా పరిగి మండలం మాదారం గ్రామంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ జనరల్ సందీప్ శ్యాండిల్య ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్కూల్ విద్యార్థులు, యువత మరియు గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడి.. మాదకద్రవ్యాల వాడకం వల్ల జరిగే అనర్థాలను, ప్రాణాలకు కలిగే ముప్పును ఆయన పూసగుచ్చినట్లు వివరించారు.తెలంగాణ భవిష్యత్తు నేటి విద్యార్థులు, యువకుల చేతుల్లోనే ఉందన్న డీజీపీ.. మన చుట్టుపక్కల ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం లేదా సరఫరా జరిగితే వెంటనే ఎక్సైజ్ లేదా పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చే వారు టోల్ ఫ్రీ నంబర్ 1908 కు కాల్ చేయవచ్చని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ‘డ్రగ్స్ రహిత తెలంగాణ’ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే 99 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2000 గ్రామాల్లో ఈ తరహా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇందులో ఉన్నతాధికారులందరూ స్వయంగా పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఆయన క్రీడా సామాగ్రిని అందజేశారు.



# మహిళా డాక్టర్ హిట్ అండ్ రన్

హైదరాబాద్

గాంధీ నగర లో మహిళా కారుతో హిట్ అండ్ రన్ చేసింది. జీరా, భరత్ పెట్రోల్ పంపు వద్ద స్కూటీ నీ ఢీకొట్టి పరారైయింది. వేగంగా డ్రైవ్ చేసి స్కూటీ కి డికొట్టిన దృశ్యాలు సీసీటీవీ లో రికార్డ్ అయ్యాయి. బాధితుడు బీరం కృష్ణ తీవ్ర గాయాలతో అసుపత్రి లో చికిత్సపొందుతున్నాడు. కవాడిగూడ నుండి రాణిగంజి వైపు వెళ్తుండగా గత నెల 2న కారు ఢీకొంది. గాంధీ నగర్ పోలీసులు సీసీ టీవీ ఫూటేజీ ఆధారంగా కారు నెంబర్ ట్రేస్ చేసారు. కారు నెంబర్ టీఎస్ 08 హెచ్ఎల్ 4682 నిలోఫర్ డాక్టర్ బెక్కం విజయ నిర్మల పేరు పై రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించారు. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేయకుండా 125(జీ) నిర్లక్ష డ్రైవింగ్ కింద కేసు నమోదు చేసారు. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి మహిళా డాక్టర్ ను అరెస్ట్ చేసి కారు సీజ్ చేయాలని కృష్ణ కుటుంబ సభ్యులు కోరుతున్నారు

# ఏసీబీ వలలో పామిడి సబ్ రిజిస్ట్రార్

అనంతపురం మార్చి 6,

పామిడి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. లంచం తీసుకుంటూ సబ్ రిజిస్టర్ రాధరమణ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఇంటి రిజిస్ట్రేషన్ కోసం 25 వేల రూపాయలు ప్రేవేట్ వ్యక్తి వెంకటేశులు లంచం తీసుకున్నారు. సబ్ రిజిస్టర్ రాధరమణ లంచం తీసుకోమని చెప్పినట్లు ప్రేవేట్ వ్యక్తి వెంకటేశులు చెప్పిన ఏసీబీ అధికారులకు చెప్పారు. రాధారమణను కార్యాలయంలో ఏసీబీ డిఎస్పీ ప్రసాద్ రెడ్డి, సిఐ హమీద్ ఖాన్ విచారించారు. అనంతపురంలోని సబ్ రిజిస్టర్ ఇంట్లో కూడా ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. ఇంటికి తాళం వేసి సోదాలు చేసారు.

# సీపీఎస్ ఉద్యోగుల డెమోగ్రాఫిక్ వివరాల సరిచూడాలన్న నిర్మల్ జిల్లా డీటీఓ సరోజ



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 06(భారత శక్తి) నిర్మల్ జిల్లాలోని అన్ని డీడీవోల దృష్టికి తెలియజేయడమైనది ఏమనగా, తమ పరిధిలో ఉన్న సీపీఎస్ ఉద్యోగుల డెమోగ్రాఫిక్ వివరాలు --- మొబైల్ నంబర్, పాన్ కార్డ్ నంబర్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, నామినీ వివరాలు మొదలైనవి --- సరిగా నమోదయ్యాయా లేదా అనేది తప్పనిసరిగా పరిశీలించుకోవాలని నిర్మల్ జిల్లా డీటీఓ శ్రీమతి సరోజ గారు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ వివరాలను సరిచూడటానికి డీడీవో లాగిన్‌లో ప్రత్యేకంగా వెసులుబాటు కల్పించబడిందని ఆమె పేర్కొన్నారు. ఇందుకోసం సంబంధిత డీడీవోలు జ=ూ చీూణూ ాతీశేమ్శుఅ వెబ్‌సైట్‌లోకి వెళ్లి, ఖంవతీ ×ణ బాక్స్‌లో తమ ణణూ =వస్త్ర-ఱర్‌తీక్ఱశీఅ చీబఎఎవతీ కు రెండు సున్నాలు (00) జోడించి పాస్‌వర్డ్‌ను రీసెట్ చేసుకోవాలని సూచించారు.

ఇంకా ఏవైనా సమస్యలు ఎదురైతే, సంబంధిత ట్రెజరీ అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

# జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా భైంసా డిపోలో భద్రతా అవగాహన.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 06(భారత శక్తి)జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా భైంసా డిపోలో భద్రతా అవగాహన సమావేశం

జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా డిప్యూటీ ఆర్ఎం (ఎం)/అదిలాబాద్ భైంసా డిపోను సందర్శించి సమగ్రంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్యారేజ్ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అగ్నిమాపక భద్రత, అత్యవసర పరిస్థితుల్లో సంసిద్ధత, అలాగే ఆరోగ్య భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విస్తృతంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు విధి నిర్వహణలో భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, ప్రమాదాలను నివారించడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు తక్షణ చర్యలు ఎలా తీసుకోవాలి అనే అంశాలపై కూడా మార్గదర్శనం చేశారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో ప్రజలందరూ భాగస్వాములు కావాలి:

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 6:

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో జిల్లా ప్రజలందరూ భాగస్వాములై జిల్లా అభివృద్ధికి సహకరించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మార్చి 15వ తేదీ వరకు కొనసాగనున్న పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.ప్రజా పాలన ప్రగతి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మొదటి థీమ్ అయిన "పరిశుభ్రత" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం సూర్యాపేట మున్సిపాలిటీ నుండి ప్రారంభించారు.

అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా వరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పరిశుభ్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నేటి నుంచి మార్చి 15వ తేదీ వరకు కొనసాగనున్న పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.అలాగే అధికారులు తమ తమ కార్యాలయాల్లో ఉన్న పెండింగ్ ఫైల్స్‌ను త్వరితగతిన క్లియర్ చేయాలని ఆదేశించారు.అదేవిధంగా మార్చి నెల ఆర్థిక సంవత్సరానికి చివరి నెల కావడంతో మున్సిపాలిటీల ఆదాయం పెంచేందుకు పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో గల పెండింగ్ ఫైళ్లను, పారిశుధ్య పనులను త్వరితగతిన పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల యజ్ఞాన్ని విజయవంతం చేయాలి: జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 06: జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ఆద్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశం శుక్రవారం ఉమ్మడి జిల్లా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధికారులతో నిజామాబాద్ కలెక్టరేట్ లో

సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంత్రి సీతక్క కు ఐడిఓసి చేరుకున్న సందర్భంగా పూల మొక్క అందించి స్వాగతం పలికారు.

జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో 99 రోజుల పాటు జిల్లా యంత్రాంగం ఒక యజ్ఞంలా చేపట్టి ప్రజలకు సంక్షేమ అభివృద్ధి పథకాలు యుద్ధ ప్రాతిపదికన ఆయా శాఖల సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి అందించాలని అన్నారు.

ఈ 99-రోజుల కార్యాచరణ ప్రణాళిక 10 ప్రధాన అంశాలతో (థీమ్స్)

1. పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ళ పరిష్కరణ

2. ఆరోగ్యం,3. సురక్షితంగా చేరుకోండి,4. సంక్షేమం,

5. పిల్లల భద్రత, రక్షణ, డ్రగ్స్కు నో,6. రైతులు (వ్యవసాయం),7. విద్య,8. యువత, క్రీడలు,

9.మహిళలు,10 పర్యావరణంపది థీమ్ లపై దృష్టి సారించాలని99 రోజుల యాక్షన్ ప్లాన్తయారుచేసి ప్రతి రోజు కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు. అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను జిల్లా ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో జిల్లాలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంను ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు.

మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఈ ప్రణాళికను అమలు చేయాలని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి, జిల్లా స్థాయి. రాష్ట్ర స్థాయి వరకు షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలను నిర్వహించి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని , వచ్చే 99 రోజులు అత్యంత కీలకం అని అన్నారు.

ఈ కార్య క్రమాన్ని పక్కాగా అమలు చేసి ఈ 99 రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ తో పాటు అన్ని విభాగాలు,

సాంకేతిక సంస్కరణలు తేవాలి

పరిపాలనలో అధునాతన సాంకేతిక నైపుణ్యాలు రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పౌరులకు అవసరమైన సేవలన్నింటినీ మరింత సులభతరం చేయాలని స్పష్టం చేశారు. ఇంటి నుంచే ఆన్ లైన్ ద్వారానే అన్ని సేవలు పొందేలా సాంకేతిక సంస్కరణలు తీసుకురావాలని ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అన్ని ఆఫీసుల్లో పారిశుద్ధ్యం, డ్రైవ్ నిర్వహించాలి. 99 రోజుల కార్య క్రమ పురోగతిని వ్యక్తిగతంగా పరిశీ లిస్తా. క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తా.. అధికారుల పనితీరులోపాలను సహించనని హెచ్చరించా రు. ఐఏఎస్ అధికారులే ప్రభుత్వానికి వెన్నెముక అని, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం... అమల్లోకి తెచ్చిన ప్రతి పాలసీ విజయం మీపైనే ఉంటాయన్నారు.

యాక్షన్ ప్లాన్

99 రోజుల ప్రణాళిక - ముఖ్య తేదీలు

మార్చి 12: సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు శిక్షణ గ్రామ సభలో ఇందిరమ్మ ఇల్లు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, మహాలక్ష్మి, రుణమాఫీ లబ్దిదారులు, తదితర వాటిని నిర్వహించాలని అన్నారు.

ఏప్రిల్ 2: గ్రామ పంచాయితీ స్థాయి

ఏప్రిల్ 16: మండల స్థాయి

మే 2: నియోజకవర్గ స్థాయి

మే 22: జిల్లా స్థాయి

జూన్ 2: రాష్ట్ర స్థాయి

కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలో నిర్వహించతలపెట్టిన అభివృద్ధి పథకాలు అమలు పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ, జిల్లాలో చేపడుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులను ,శంకుస్థాపనలు, ,గృహ ప్రవేశాలు, తదితర అభివృద్ధి పనులను చేపట్టి జిల్లాను మొదటి దశలో ఉంచాలని తెలిపారు.

ఈ సమావేశం లో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, , అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి:

## జిల్లా కలెక్టర్- తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 6: 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేస్తూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.శుక్రవారం బాలేంల గ్రామపంచాయతీ కార్యాలయంలో 99 రోజుల కార్యక్రమం అమలు పై నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా గెలిచిన స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజలలో మంచి పేరు సుస్థిరం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, మార్చి 6 నుంచి మార్చి 15 వరకు జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య



డ్రైవ్ లో స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పెండింగ్ ఫైల్స్ క్లియర్, త్రాగునీరు, విద్యా, వైద్యం పై వచ్చిన దరఖాస్తులు పది రోజులలో క్లియర్ చేయాలని కలెక్టర్ అన్నారు. 99 రోజుల కార్యక్రమంలో చివరి వరకు ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గోన్నాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేయాలని సూచించారు.పేద ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.బాలేంల గ్రామంలో ప్రజలతో కలెక్టర్ ముచ్చటించారు మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిచెన్ షెడ్డు, స్టోర్ రూమ్, వంటశాల, కంప్యూటర్ రూమ్ ల్యాబ్ పరిశీలించారు, స్కూలుకు సంబంధించిన బిల్లులు ఆన్లైన్లో ఎలా చేస్తారు అని అడిగి తెలుసుకున్నారు 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ మంచి మార్కులు తెచ్చుకోవాలని, ప్రతి సబ్జెక్టులో నూటికి 70 శాతం మార్కులు రావాలని కలెక్టర్ కోరారు.అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లల భోజన వసతులు అడిగి తెలుసుకున్నారు, పల్లె దావఖానాలో ఏ ఎన్ ఎం లతో ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, ఆర్డిఓ వేణు మాధవరావు, తహసిల్దార్ కృష్ణయ్య,ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీఓ లింగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసాదు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా జిల్లాకు ఫైజాన్ అహ్మద్ చేసిన సేవలు మరువలేనివి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 06(భారత శక్తి) జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా ఫైజాన్ అహ్మద్ చేసిన సేవలు మరువలేని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా పనిచేసి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు అదనపు కలెక్టర్ గా బదిలీపై వెళ్లిన ఫైజాన్ అహ్మద్ కు, గురువారం రాత్రి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఏ ఉద్యోగికి అయినా బదిలీ ప్రక్రియ సర్వసాధారణమని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా ఫైజాన్ అహ్మద్ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ముఖ్యంగా స్థానిక సంస్థల బలోపేతానికి, పల్లె, పట్టణ ప్రగతి, ఎన్నికల నిర్వహణ, పలు విభాగాలకు నోడల్ అధికారిగా, నిర్మల్ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా, ప్రభుత్వ పథకాల అమలు, తదితర కార్యక్రమాల అమలులో ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించే తత్వం ఆయన సొంతమని కలెక్టర్ ప్రశంసించారు. బదిలీపై వెళ్లిన జిల్లాలో కూడా అదే స్ఫూర్తితో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇన్ చార్జి మాతా శిశు సంక్షేమ శాఖ అధికారిగా, శాఖకు మంచి సేవలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

నిర్మల్ జిల్లాలో పని చేయడం సంతృప్తినిచ్చింది:ఫైజాన్ అహ్మద్.

ఈ కార్యక్రమంలో భాగంగా బదిలీపై వెళ్లిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ,

నిర్మల్ జిల్లాలో పనిచేయడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, జిల్లా అభివృద్ధిలో భాగస్వామిని కావడం సంతోషంగా ఉందని తెలిపారు. విధుల నిర్వహణలో తనకు పూర్తి సహకారం అందించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,





అధికారులు, సిబ్బందికి అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ, ఉద్యోగ నిర్వహణలో అదనపు కలెక్టర్ అందించిన ప్రోత్సాహకం, ఆయనతో ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, పలువురు అధికారులు బదిలీపై వెళ్లిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ దంపతులను పూలమాల, శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డిఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లాడ్జీల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: వేములవాడ సిఐ వీరప్రసాద్



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, భారత శక్తి , మార్చి 06: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని లాడ్జీలు, వసతి గృహాల నిర్వహణపై పోలీసులు నిఘా పెంచారు. క్షేత్రస్థాయిలో భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా పట్టణ సిఐ వీరప్రసాద్ లాడ్జ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి లాడ్జీకి వచ్చే అతిథి వివరాలను రిజిస్టర్‌లో ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు, వారి ఆధార్ కార్డు లేదా ప్రభుత్వం గుర్తించిన ఏదైనా గుర్తింపు పత్రాల ప్రతులను తప్పనిసరిగా సేకరించి భద్రపరచాలి. భద్రతా దృష్ట్యా ప్రతి లాడ్జ ఆవరణలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి రికార్డింగ్‌ను నిర్ణీత కాలం పాటు భద్రంగా ఉంచాలి. ముఖ్యంగా 18 ఏళ్లలోపు మైనర్లకు వారి తల్లిదండ్రులు లేదా చట్టబద్ధమైన సంరక్షకులు లేకుండా గదులు కేటాయించకూడదని సిఐ స్పష్టం చేశారు. లాడ్జ్ గదుల్లో మరియు ప్రాంగణంలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని, దీనికి సంబంధించిన హెచ్చరిక బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. నిబంధనలు, నిషేధాలు మరియు పోలీసుల సూచనలను ఎవరైనా బేఖాతరు చేస్తే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు లాడ్జ్ నిర్వాహకులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్




రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, భారత శక్తి , మార్చి 06: పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. పీఎం – సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు టీ ఎస్ రెడ్ కో (ువశ్రీఖఅస్త్రుఖఅు క్ష్ఫవ =వఅవఋఎశ్రీవ జుఅవతీస్త్రవ ణవజవశ్రీశీజూఎవత్ జశీతీజూశీతీఫ్‌ఱశీఅ ూఱఎ- ుఀవః) ఆధ్వర్యంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమ లో భాగంగా పీఎం – సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కర్బన ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో అవగాహన కల్పించాలని సూచించారు. మూడు కిలోవాట్ల సోలార్ పలకలు ఏర్పాటు చేసుకొంటే కేంద్ర ప్రభుత్వం రూ. 78 వేలు సబ్సిడీ అందిస్తుందని, దాంతో పాటు ప్రతీ నెలా రూ. 2 వేల విద్యుత్ బిల్లు అదా చేయవచ్చని తెలిపారు. పెట్టుబడి ఆరు సంవత్సరాల్లో తిరిగి వస్తుందని అన్నారు. సోలార్ విద్యుత్ పర్యావరణ హితమని తెలిపారు. మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు ఇస్తూ అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని సూచించారు. ఈ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెస్ ఎండీ బిక్షపతి, డీఈ అంజయ్య, డీఓ మునీందర్ రెడ్డి, ఏడీఓ లక్ష్మీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

## ఓఒం మేఘూరెడ్డి.

వనపర్తి. మార్చి 06:

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశం లో పాల్గొని.పలు అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశాలలో శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పాల్గొని పలు అంశాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహం.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మహబూబ్నగర్ శాసనసభ్యులు ఎన్ ఎం శ్రీనివాస్ రెడ్డి .వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి అచ్చంపేట శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ .మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఊబేదుల్ల కోత్వాల్ .రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి.ఐదు జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.అటవీ శాఖకు సంబంధించిన చిన్న సమస్యల పైన అధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో అవి ఏళ్ల తరబడిగా అపరిష్కృతంగానే ఉంటున్నాయని ఆయన మంత్రిగారు దృష్టికి తీసుకువచ్చారు.జిల్లా హాస్పిటల్స్ లో అత్యవసర వైద్య సేవల కోసం వచ్చే వారిని హైదరాబాద్ సిఫారసు చేస్తున్నారని ఆస్పత్రులలో కావలసిన అన్ని సదుపాయాల ఏర్పాటు కోసం మంత్రిగారి దృష్టి సారించారని ఆయన కోరారు.సమృద్ధిగా యూరియా ఉన్న చిన్న చిన్న సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆన్లైన్ బుకింగ్ లాంటి వాటిపై వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి బేస్మెట్ లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో పూర్తిస్థాయి అవగాహన లేదని లబ్ధిదారులకు అందుకు సంబంధించిన అవగాహన కల్పించేలా చూడాలని ఆయన సూచించారు.వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ సరఫరాలో కొన్ని ప్రాంతాల్లో ఒకలాగా మరికొన్ని ప్రాంతాల్లో ఇంకోలా ఉ ందని అలాంటి సమస్య లేకుండా సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు.ప్రజా రవాణాలకు సంబంధించి ఆటోలలో ఇతరత్రా రవాణా వాహనాలలో ఎక్కువమందిని కూర్చోబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయంలో ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఖీూ అధికారులు దృష్టి సారించి ప్రమాదాల నివారణ పై చర్యలు తీసుకోవాలన్నారు.ముఖ్యమంత్రి సొంత జిల్లాలో అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

# తమ సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు

పిడుగురాళ్ల, మున్సిపల్ కార్మికుల రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా నిరాహార దీక్షలను పిడుగురాళ్ల పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పారిశుద్ధ మహిళ్ళా కార్మికులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలని అన్నారు. అంతేకాకుండా పని ప్రదేశాల్లో మంచినీళ్లు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కల్పించి, కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. 12వ పిఆర్సి ప్రకారం వేతనాలు అమలు చేయాలని, రిటైరైన మరియు చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చేయాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, మహిళా కార్మికులకు నెలసరి సెలవులను, క్యాజువల్ లీవులు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రేవంత్ కు కులతత్వం ఎక్కువ మంద కృష్ణ మాదిగ

హైదరాబాద్

సీఎం కు కృతజ్ఞత భావం కంటే కులతత్వం ఎక్కువ అని నిరూపించుకుంటున్నారు. మొసలి కన్నీరి ఆపి నిజాయితీగా ఉండక పోతే మాదిగలు రేవంత్ పాలనకు అడ్డుకట్ట వేస్తారని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం అయన సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మీడియాతో మాట్లాడారు.

ఎన్నడులేని విధంగా మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగింది రేవంత్ పాలనలోనే. 11 % రెసర్వేషన్ ఇవ్వాల్సి ఉ ండగా 9% మాత్రమే ఇచ్చారు. దీంతో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగింది. గత నోటిఫికేషన్ లకు కూడా రెసర్వేషన్ అమలు చేస్తామని చెప్పి మోసం చేసారు. దీంతో వేలాది ఉ ద్యగాలు నష్టపోయామ్. లోక్సభలో మాదిగలకు ప్రాతినిధ్యం లేకుండా చేసిన ఘనత రేవంత్ రెడ్డి దే. రాజ్యసభలో కూడా అవకాశాలను అడ్డుకున్నది రేవంత్ రెడ్డి నే. ?? మొదటినుంచి రేవంత్ కు సన్నిహితంగా ఉన్న సాంబయ్యను కాదని సకల సౌకర్యాలు అందుకుంటూ సీఎంతో సమానంగా అధికారాన్ని చలాయిస్తున్న వేము నరేందర్ రెడ్డి కి అవకాశం ఇచ్చారు. గతంలోనూ సాంబయ్యకు అన్యాయం చేసింది రేవంత్ రెడ్డినే. బి ఆర్ ఎస్ బీఫామ్ తీసుకున్న కడియం శ్రీహరి కుమార్తెకు కాంగ్రెస్ నుంచి బీఫామ్ ఇప్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. ఇప్పటికేనా మారి భవిష్యత్ లో మాదిగలకు అవకాశం ఇవ్వండి లేక పోతే మీకు అధికారాన్ని ఇచ్చినా వారే మీకు దాన్ని దూరం చేస్తారు అని హెచ్చరించారు.

ముఖ్యమంత్రికి సన్మాన సభ చేసేవారు మాదిగ సామాజిక వర్గానికి రెండేళ్లుగా చేస్తున్న అన్యాయాలను సమర్థిస్తూ చేస్తున్నారా అనే అనుమానం కలుగుతుందని అన్నారు. మాదిగల వల్లే అధికారాన్ని పొందగలిగామని చెబుతున్న రేవంత్ మాదిగలను అనగా తొక్కుతున్నారా అంటూ ప్రశ్నించారు. తీరు మార్చుకోకపోతే అధికారాన్ని ఇచ్చిన వారే దాన్ని దూరం చేసి చూపిస్తారన్న విషయాన్ని మరవద్దని అన్నారు.

# 99 రోజుల 'ప్రజా పాలన'తో నగర ముఖచిత్రం మార్పు

: జీహెచ్ఎంసీ కమిషనర్

* శాస్త్రీపురం ఆర్ఓబీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
* ప్రారంభానికి సిద్ధంగా కోత్వాల్‌గూడ ఎకో హిల్ పార్క్
* క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన ఆర్వీ కర్ణన్






హైదరాబాద్, మార్చి 06 (భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ద్వారా నగరంలో అనేక సానుకూల మార్పులు రానున్నాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ విభాగాల సమన్వయంతో సాగే ఈ ప్రణాళిక వల్ల నగరవాసుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు.

**యుద్ధ ప్రాతిపదికన ఆర్ఓబీ పనులు**

ప్రగతి ప్రణాళిక ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం రాజేంద్రనగర్ జోన్, అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రీపురం ఆర్ఓబీ (ROB) నిర్మాణ పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్రోచ్ రోడ్లతో పాటు మిగిలి ఉన్న పెండింగ్ పనులన్నింటినీ తక్షణమే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రవాణా సౌకర్యాల మెరుగుదలే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలన్నారు.

**ఇంటింటా చెత్త సేకరణే లక్ష్యం**

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్.. అత్తాపూర్ పరిధిలో ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియను స్వయంగా తనిఖీ చేశారు. 100% సేకరణ: నగరంలో వంద శాతం ఇళ్ల నుంచి చెత్త సేకరించేలా చర్యలు చేపట్టాలని స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు సూచించారు. డెడ్ లైన్: రోడ్లపై ఎక్కడా చెత్త నిల్వలు కనిపించకూడదని, గార్బేజ్ పాయింట్ల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను ప్రతిరోజూ ఉదయం 9 గంటల లోపే ప్రాసెసింగ్ యూనిట్లకు తరలించాలని స్పష్టం చేశారు.

**ముస్తాబవుతున్న ఎకో హిల్ పార్క్**

ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానున్న కోత్వాల్‌గూడ ఎకో హిల్ పార్క్ పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. ప్రారంభోత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కేవలం పారిశుద్ధ్యానికే పరిమితం కాదని, జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల సమన్వయంతో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని కమిషనర్ తెలిపారు. "పార్కుల అభివృద్ధి, చెరువుల ప్రక్షాళన, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, టౌన్ ప్లానింగ్ మరియు రోడ్డు భద్రత వంటి అంశాలకు ఈ 99 రోజుల్లో అత్యంత ప్రాధాన్యత ఇస్తాం."

— **ఆర్వీ కర్ణన్, జీహెచ్ఎంసీ కమిషనర్**

ఈ తనిఖీల్లో కమిషనర్‌తో పాటు రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మందా మకరందు, అదనపు కమిషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ప్రజల ముంగిటకే పాలన.. ప్రగతికి సరికొత్త బాట!

* **కొంగరకలాన్‌లో '99 రోజుల కార్యచరణ' ప్రారంభించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

ఇబ్రహీంపట్నం, మార్చి 06 (భారత శక్తి): ప్రభుత్వ లక్ష్యం కేవలం పథకాలు ప్రకటించడం మాత్రమే కాదు.. అవి అర్హులైన ప్రతి గడపకూ చేరడమే అసలైన విజయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కొంగరకలాన్ వేదికగా "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల ప్రత్యేక కార్యచరణ కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. గ్రామస్థుల కోలాహలం, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభమైంది.

**వార్త ముఖ్యాంశాలు:**

లక్ష్యం: 99 రోజుల్లో పెండింగ్ సమస్యల పరిష్కారం మరియు అభివృద్ధి పనుల వేగవంతం.
పర్యవేక్షణ: గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అధికారుల నిరంతర క్షేత్రస్థాయి పర్యటన.
సంక్షేమం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు.

**అధికారులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం**

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ అధికారులకు కీలక సూచనలు చేశారు:

**క్షేత్రస్థాయికి వెళ్లండి:**
ఫైళ్లు కార్యాలయాల్లో మూలుగుతుండకూడదు, అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోవాలి.
పారదర్శకత: సంక్షేమ పథకాల ఎంపికలో రాజీ పడకుండా, పూర్తి పారదర్శకతతో అర్హులకు న్యాయం చేయాలి.
త్వరితగతిన పరిష్కారం: ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించే బాధ్యత అధికారులదే.

"రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ఈ 99 రోజుల ప్రణాళిక అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలవాలి. ప్రజలు తమ సమస్యలను నేరుగా మా దృష్టికి తీసుకురావచ్చు."

**- మల్‌రెడ్డి రంగారెడ్డి (ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం)**

**భారీగా తరలివచ్చిన జనం**

తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో గ్రామస్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. స్థానిక నేతలు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ ప్రగతి బాటను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు మరియు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.



## ప్రతీ మహిళా ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలి : మంత్రి పొన్నం

హైదరాబాద్, మార్చి 06 (భారత శక్తి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం 99 రోజుల పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గ్రామాలు, వార్డుల నుంచి రాజధాని వరకూ ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. చాచా నెహ్రూ పార్క్‌లో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలను మంత్రి ఇవాళ ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, నగరంలోనే మొట్ట మొదటిసారిగా ఏర్పాటు చేసిన అద్దాల లైబ్రరీని, ఈ వ్యర్థాల సేకరణ సెంటర్‌ను ప్రారంభించారు. మహిళా సంఘాలకు రూ.35 కోట్ల సున్నా వడ్డీ రుణాల చెక్కులను అందజేశారు. అనంతరం మహిళా సంఘాలతో ముఖాముఖి సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ప్రారంభించాం. 12 వేల గ్రామాల్లో, వార్డుల్లో, మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుంది" అని తెలిపారు.

* **వాటివల్ల ఉపయోగం ఉండదు.. రీసైక్లింగ్ చేయాలి**

పాడైపోయిన టీవీలు, పాత ఫ్రిడ్జులు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు మన ఇళ్లలో ఉంచుకోవడం వల్ల ఉపయోగం ఉండదని మంత్రి అన్నారు. వాటిని ఈ వ్యర్థాల సేకరణ సెంటర్‌కు తెచ్చి రీసైక్లింగ్ చేయాలన్నారు. అదేవిధంగా 1500 చదరపు గజాల స్థలంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఈ లైబ్రరీ స్థానిక ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అంతేకాదు, ఇక్కడ పుస్తకాలు డొనేట్ చేసేందుకు ప్రత్యేకంగా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## అడ్డు గొడుగుల్లా పుట్టుకొస్తున్న వెంచర్లు

## కన్వర్షన్ పర్మిషన్ లేకపోయినా అధికారుల నిర్లక్ష్యం?



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 05 (భారత శక్తి) : నిర్మల్ జిల్లా తానూరు మండలంలోని ధగం గ్రామంలో ఇటీవలి కాలంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు అడ్డు గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే ఈ వెంచర్లలో చాలా వరకు వ్యవసాయ భూములను నాన్‌అగ్రికల్చరల్‌గా మార్చేందుకు అవసరమైన కన్వర్షన్ పర్మిషన్ లేకుండానే ప్లాట్లుగా విభజించి విక్రయాలు జరుగుతున్నట్లు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానికంగా ఏర్పడుతున్న ఈ వెంచర్లకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయంపై అధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడం వల్ల గ్రామ ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలను పట్టించుకోకుండా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయాలు చేస్తున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములను కన్వర్షన్ లేకుండా ప్లాట్లుగా మార్చడం వల్ల ప్రభుత్వానికి రావలసిన ఆదాయం కూడా కోల్పోతుందని వారు అంటున్నారు. కావున నిర్మల్ జిల్లా తానూరు మండలంలోని ధగం గ్రామంలో ఏర్పడుతున్న అనుమతులు లేని వెంచర్లపై సంబంధిత రెవెన్యూ మరియు పట్టణాభివృద్ధి శాఖ అధికారులు వెంటనే దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

* **ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**
* **రూ.35 కోట్ల వడ్డీ లేని రుణాల పంపిణీ**
* **హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, మార్చి 6 (భారత శక్తి) రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అండతో మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం మాసాబ్‌ట్యాంక్‌లోని చాచా నెహ్రూ పార్క్‌లో జీహెచ్ఎంసీ పరిధిలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 99 రోజుల ప్రణాళికతో ప్రగతి పథం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వార్డులు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకే ఈ 99 రోజుల కార్యాచరణను రూపొందించినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 వేల ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణలో మహిళలు చురుగ్గా భాగస్వాములు కావాలని కోరారు.

* **ఆకర్షణీయంగా 'అద్దాల లైబ్రరీ'.. బాధ్యతగా 'ఈ-వేస్ట్' సేకరణ**

చాచా నెహ్రూ పార్క్‌లో 1500 చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన *అద్దాల లైబ్రరీ (Glass Library)*ని మంత్రి ప్రారంభించారు. నగరవాసుల్లో పఠన అలవాటును పెంచేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని, పుస్తకాలను దానం చేసే వారు ఈ అవకాశాన్ని వాడుకోవాలని కోరారు. అనంతరం పర్యావరణ హితమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈవేస్ట్ (EWaste) సేకరణ కియోస్క్‌లను ప్రారంభించారు. ఇంట్లో మూలన పడి ఉన్న పాత టీవీలు, ఫ్రిజ్‌లు, కంప్యూటర్లను ఇక్కడికి చేర్చి రీసైక్లింగ్‌కు సహకరించాలని సూచించారు.

**ఇందిరా మహిళా శక్తితో ఉపాధి:**

మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35 కోట్ల సున్నా వడ్డీ రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అలాగే, మహిళల ఆధ్వర్యంలో నడిచే *'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్'*ను ప్రారంభించి, స్వయం ఉపాధి దిశగా వారిని ప్రోత్సహించారు. నూతన పథకం: నగరంలోని మహిళా సంఘాలు ముందుకు వస్తే.. ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులను చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు.
సంక్షేమ ఫలాలు: ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు మహిళల అభ్యున్నతికేనని పేర్కొన్నారు. సెట్విన్ ద్వారా శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ వంటివి మరింత వేగవంతం చేస్తామన్నారు.

**ప్రత్యేక ఆకర్షణగా 'ఇందిరమ్మ చీరలు'**

ఈ కార్యక్రమానికి మహిళలందరూ ఇందిరమ్మ చీరలు ధరించి భారీ సంఖ్యలో తరలిరావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె. ఉపేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన, జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాలుగేళ్ల నా మనోవేదన స్వామి వారి దయతో తీరిపోయింది : కవిత



హైదరాబాద్, మార్చి 06 (భారత శక్తి): నేను నాలుగు సంవత్సరాలుగా పడుతున్న మనోవేదన స్వామి వారి దయతో తీరిపోయింది అని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. సత్యం, న్యాయం, ధర్మం మావైపు ఉందని నేను చెప్తూ వచ్చాను స్వామి వారి దయతో కంప్లీట్‌గా క్లీన్ చిట్ వచ్చింది. అందుకే కాలినడకన వచ్చి స్వామివారికి మొక్కు చెల్లించుకున్నాను. తెలంగాణ ప్రజల పక్షాన తెలంగాణ ఇంటి పార్టీగా పని చేయడానికి రానున్న రోజుల్లో రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నాం ఆ పార్టీకి స్వామి వారి ఆశీస్సులు, దయ ఉండాలని కోరుకున్నాను. తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలని, బాగుండాలని కోరుకున్న తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలు, ప్రజలు బాగుండాలని స్వామి వారిని కోరుకున్నాను అని కవిత పేర్కొన్నారు.

# ఛీ.. ఛీ.. పాడు పాఠశాల.!

* **వాట్సప్ లో వికృత మెసేజ్ లు**
* **మాట వింటే సరి.. లేకుంటే ఒత్తిడే.!**
* **మదన పడుతున్న లేడి టీచర్లు.!**
* **మానసిక ఒత్తిడితో టీచర్లు సతమతం**
* **కీచకుడి ఆకృత్యాలకు ఎందరో టీచర్లు బలి**
* **ఆందోళనలో హయ్యర్ క్లాస్ విద్యార్థుల పేరెంట్స్**

మణుగూరు, మార్చి 06 (భారతశక్తి) : స్త్రీని గౌరవించిన చోటే దేవతలు పూజలు అందుకుంటారని వేదాలు పురాణాలు కావ్యాలు ఘోషిస్తున్నాయి. ఆదిపరాశక్తిగా సరస్వతి దేవి కొలువైన విద్యాలయాలలో కీచకుల వికృత శేష్టలతో మహిళ ఉపాధ్యాయునులు అంతర్మథనానికి లోనవుతున్నారు. ఓవైపు విద్యార్థులకు విద్య బోధన చేస్తూనే మరోవైపు ఆ కీచకుడు వేధింపులను తలుచుకుంటూ లోలోపల కుమిలిపోతున్నారు. ఛీ.. ఛీ.. పాడు పాఠశాల పాడు ప్రిన్సిపాల్ అని లేడి టీచర్లు చిదరించుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం, గుట్టమల్లారం లోని శ్రీ చైతన్య ప్రైవేట్ విద్యా సంస్థలోని ప్రిన్సిపాల్ కి కామం కళ్ళలో నింపుకొని లేడి టీచర్లను తన క్యాబిన్ కి పిలిచి ముచ్చట్లు పెట్టేవాడని తెలుస్తోంది. ఆయన కన్ను పడిన లేడి టీచర్ల కు హృదయం ఉప్పొంగేలా, మనస్సు హత్తుకునేలా.. వాట్సప్



మేసేజ్ లతో చాట్ చేసేవాడన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.

*** మనస్సు హత్తుకునేలా చాటింగ్***


ప్రైవేటు పాఠశాలలో ఓ కీచకుడు అన్ని తానై పాఠశాల వ్యవహారాలను చక్కబెడుతూనే మరోవైపు మహిళ ఉపాధ్యాయునులే లక్ష్యంగా వేధింపులకు గురిచేస్తున్న ఓపికతో విద్య బోధన చేసి విధులు ముగించుకొని ఇంటిబాట పట్టేవారు. ప్రిన్సిపాల్ కన్నుపడిన వారికి మనస్సును హత్తుకునే మధురమైన భాషతో పర్సనల్ గా వాట్సప్ లో బంగారం అంటూ ఛాటింగ్ చేసేవాడు. ఈ మేసేజ్ లు చూసి స్కూల్ బాస్ ఇలాంటివి పెడుతున్నాడని కొంతమంది బయటకు చెప్పుకోలేక అంతర్మథనంతో కుమిలిపోయేవారు. ఎంతో ఉన్నత చదువులు చదువుకొని ప్రభుత్వ కొలువులు రాక ఇంట్లో ఉండలేక ఉపాధి కోసం ప్రవేట్ పాఠశాలలో పనిచేస్తున్న తమపై ప్రిన్సిపాల్ వికృత చేష్టలు, వేధింపులకు గురిచేయడంతో సహించలేక పోయారు. విధి లేక వాట్సప్ ఛాటింగ్లు బహిర్గతం చేయడంతో గుట్టుచప్పుడు కాకుండా లేడి టీచర్లను సైతం విధుల నుండి తొలగించారు.

*** అంతర్మథనంలో పేరెంట్స్..**

శుక్రవారం భారతశక్తి దినపత్రికలో 'ప్రవేట్ స్కూల్లో కీచక ప్రిన్సిపాల్' ప్రచురించిన కథనానికి హయ్యర్ క్లాస్ విద్యార్థినీల తల్లిదండ్రులు అంతర్మథనంలో పడ్డారు. ఇలాంటి స్కూల్లో నా మా పిల్లలు చదివేది అంటూ అసహ్యించుకుంటున్నారు. విద్యార్థులకు విద్యా బుద్ధులు చెప్పాల్సిన ప్రిన్సిపాల్ వక్రమార్గం పట్టాడన్న విషయం తెలుసుకున్న పేరెంట్స్ ముక్కున వేలుసుకుంటున్నారు. కార్పోరేట్ స్కూల్ కావడంతో స్కూల్లో జరిగే విషయాలు బయటికి పొక్కకుండా కట్టడి చేస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుత సమాజంలో ఆకతాయిల చేష్టలు ఎక్కువతున్నాయి. జరగరాని ఘటనలు జరిగితే పేరెంట్స్ కు, అధికారులకు సమాధానం చెప్పే వారు కరువయ్యారని పేరెంట్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

*** లేడి టీచర్లపై వత్తిడి**

ప్రవేట్ స్కూల్లో లేడి టీచర్లు ఒత్తిడి తట్టుకోలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ప్రిన్సిపాల్ చేసే తప్పులు టీచర్ల మీద నెట్టివేస్తూ.. విద్యార్థుల తల్లిదండ్రుల ముందు టీచర్లను దోషిగా నిలబెడుతూ.. వృత్తిని మరచి ఇష్టం వచ్చినట్లు నీచంగా మాట్లాడి నలుగురిలో పరువు తీస్తున్నారు. నెల నెల జీతం ఇస్తున్నామని యాజమాన్యం కంటే ముందుగా ప్రిన్సిపాల్ హెచ్చరిస్తూ.. టీచర్లపై పెత్తనాలు చెల్లాయిస్తూ.. కిచకుడి చెప్పుచేతలో ఉండాలని హుక్కుమ్ జారీ చేస్తుండడంతో ఉపాధ్యాయునులు చేసేది ఏమీ లేక తమ విద్యార్థులకు విద్యాబోధనే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కార్పొరేట్ విద్య సంస్థలు కావడంతో మణుగూరు బ్రాంచ్ లో ప్రిన్సిపాల్ కర్ర పెత్తనం సాగేది. పట్టణాలు, నగరాల్లో విద్యాసంస్థలను విస్తరించడంతో ఇంఛార్జీలు మణుగూరు పాఠశాల వైపు అడపాదడప వస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ఆ కీచకుడు ఏది చెబితే అదే ఈ పాఠశాలలో అమలయ్యేది. ఓవైపు కుటుంబ పోషణ మరోవైపు విధి నిర్వహణతో ప్రిన్సిపాల్ మాట వింటేనే సరే లేదంటే వారిపై చిందులు తొక్కడం, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని అఘాయిత్యాలకు పాల్పడడం ఆ పాఠశాలలో నిత్యకృతంగా మారినట్లు




ఆరోపణలు ఉన్నాయి. టీచర్లపై కిచకుడి అకృత్యాలకు, అఘాయిత్యాలకు, ఆ పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై విద్యార్థి యువజన సంఘాలు మండిపడుతున్నాయి. ఆ ప్రవేట్ పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిజాలను వెలుగులోకి తేవాలని విద్యార్థి, మహిళా సంఘాల నాయకురాలు డిమాండ్ చేస్తున్నారు. మరిన్ని వివరాలతో మరొక కథనం.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

సూర్యాపేట (భారత శక్తి) మార్చి 6 : ప్రతి ఒక్కరు ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పెండెం వెంకటరమణ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 17 అంబేద్కర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రజాపాలన ప్రగతి పాలనలో భాగంగా ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంపులో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రలలో వైద్య పరీక్షలు, శిబిరాలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ హెల్త్ క్యాంపులో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, కంటి పరీక్షలు, గైనకాలజీకి సంబంధించిన వైద్యులు, చిన్నపిల్లల వైద్యులు అందరూ అందుబాటులో ఉంటారని తెలిపారు. పేషెంట్లను పరీక్షించి అవసరమైన రోగనిర్ధారణ పరీక్షలతో పాటు వారికి మందులు ఉచితం ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ భైరబోయిన శ్రీదేవి శ్రీనివాస్, డాక్టర్ అమూల్య, అకౌంటెంట్ రవి, ఏఎన్ఎం పుష్పలత, సునీత ,ధనమ్మ, జోష్ణ, కుమారి, టెక్నీషియన్ భార్గవి,ఆషాలు రెహన, సక్కుబాయి, ఎస్కే ఖాదర్, అజయ్, ఇరుగు కృష్ణ, కుంచం రాజు, అఖిల్, వినయ్, తదితరులు పాల్గొన్నారు

## దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలకు విరాళం అందజేసిన చిలుక ఉపేందర్ రెడ్డి



ఎల్బీనగర్, మార్చి 06 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ లో శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలకు కైంకర్యమును అందజేసి దాతృత్వాన్ని చాటుకున్న చిలుక మధుర ఉపేందర్ రెడ్డి. శ్రీ రామకృష్ణా (ఐటీడీఈఎస్ కోపరేటివ్ సొసైటీ) శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం (శ్రీ దుర్గా మల్లిఖార్జున, గణపతి, సుబ్రహ్మణ్య, నవగ్రహ ఆలయములు) దేవాదాయ ధర్మాదాయ శాఖ స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర ఫాల్గుణ బహుళ తదియ తేది: 06032026, శుక్రవారం నుండి బహుళ సప్తమి తేది: 10032026 మంగళవారం వరకు పాంచాహ్నిక దీక్ష పూర్వక వార్షిక బ్రహ్మోత్సవములు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్వామి వార్లకు కైంకర్యమును అక్షరాల యాభై ఒక్క వెయ్యిల (₹51,000/ ) రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, అడగగానే మా దేవాలయ సముదాయానికి భారీ విరాళాన్ని అందజేసినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. వారు సేవా గుణానికి తర్కాణం, అమ్మవారి ఆశీస్సులతో వారు రాబోయే రోజులలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేసి, జీవితంలో ఉన్నత విజయాలను అందుకోవాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ఛైర్మన్ తలాటి రమేష్ నేత, డైరెక్టర్స్ దుర్గ ప్రసాద్, సాయి కుమార్, మాలే శ్రీమన్నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కంచరోని చెరువు భూముల ఆక్రమణలు తొలగించిన అధికారులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 06 (భారత శక్తి) : నిర్మల్ పట్టణ మండలం కంచరోని చెరువు శిఖం భూముల ఆక్రమణలు అధికారులు తొలగించారు. చెరువు శిఖం భూముల్లో గుర్తు తెలియని వ్యక్తులు ప్లాట్ లు ఏర్పాటు చేసి విక్రయించే ప్రయతం చేయగా, సమాచారం అందుకున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి ఆక్రమణలు తొలగించారు. అక్కడ వేసిన మొరం తీసివేశారు.





ఫణిగిరి కాలనీ లక్ష్మి నరసింహ స్వామి గుడిలో పలు సినిమాల సినిమాటోగ్రాఫర్ సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం మొదలువ్వబోతున్న పలు వెబ్ సిరీస్ పూజ కార్యక్రమంలో పాల్గొన్న చైతన్యపురి బిఆర్ఎస్ పార్టీ నాయకులు సొంటి చంద్రశేఖర్ రెడ్డి. ఈ సందర్బంగా ఓనర్ గారి అమ్మాయి వెబ్ సిరీస్ కథను దర్శకునికి అందజేసి నటులకు, టీమ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, అజయ్, లక్ష్మణ్, నిరంజన్, జలంధర్, నరేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, మార్చి 06 (భారత శక్తి):

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికకు సిద్ధమవుతున్న జీహెచ్ఎంసీ అధికారులు





ఎల్బీనగర్, మార్చి 06 (భారత శక్తి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు సన్నద్ధం అవుతున్న జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ అధికారులు శుక్రవారం జోనల్, 12,13,14 సర్కిల్స్ కార్యాలయాలలో, పేరుకుపోయిన పాత సామాన్లు, చెత్త చెదారాన్ని శుభ్రంగా క్లీన్ చేశారు. జీహెచ్ఎంసీ చేపట్టిన ఈ క్లీన్ అండ్ గ్రీన్ పనిలో దాదాపుగా 18 మెట్రిక్ టన్నుల పాత సామాన్లను వేలం వేస్తారని తెలిసింది. అలాగే సరూర్నగర్ నగర్ చెరువు కట్టపై స్వచ్ఛ భారత్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆఫీసర్లు, రిసోర్స్ పర్సన్స్, శానిటేషన్ సిబ్బంది కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అంటూ నినాదాలు చేసి ప్రజలకు శుభ్రతపై అవగాహన కల్పించారు.డివిజన్ల పరిధిలోని పబ్లిక్ పార్కులలోని పనికి రాని వస్తువులు, చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సరూర్నగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ బోనగిరి శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ విక్రాంత్ రెడ్డి, డిఈ చందన, ఎస్ఎస్ బుచ్చయ్య, సైదులు ,యాకయ్య, సంజీవ్ రెడ్డి,రెవెన్యూ సిబ్బంది పాల్గోని చెరువు కట్టపై ఉన్న చెత్తను, ప్లాస్టిక్ వస్తువులను డంపింగ్ యార్డ్ కు తరలింపజేశారు.

## అపసవ్య దిశ వాహన చోదకులపై దృష్టి పెట్టండి..

* **ఎల్బీనగర్ నగర్ ట్రాఫిక్ డీసీపీని కోరిన కిక్కర గోపీ శంకర్ యాదవ్**

ఎల్బీనగర్, మార్చి 06 (భారత శక్తి): సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ శుక్రవారం ఎల్బీ నగర్ ట్రాఫిక్ డీసీపీ వరికుప్పల శ్రీనివాస్ ని కలసి పలు ట్రాఫిక్ భద్రతా అంశాలపై మాట్లాడటం జరిగింది. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలలో ప్రధానంగా అపసవ్య దిశలో వాహనాలు నడిపే వారితోనే ఎక్కువ ప్రమాదం ఉందని, కొన్ని సందర్భాలలో ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉందని.. ఇలాంటి వారిపై ఎక్కువగా దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో సురక్ష సేవా సంఘం క్రియాశీలక



సభ్యులు పిల్లి. శ్రీనివాస్ యాదవ్, శ్రీపాద. నరసింహ చారి పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో దొంగల బీభత్సం

* **పెద్ద అంబర్‌పేట్‌లో చోరీ.. రూ. 30 వేల నగదు అపహరణ**

హయత్ నగర్, మార్చి 06 (భారతశక్తి) : తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. యజమానులు దైవదర్శనానికి వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకుని, ఇంట్లోకి చొరబడి నగదు, విలువైన వస్తువులతో ఉడాయించారు. ఈ ఘటన పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని బ్యాంక్ కాలనీలో కలకలం రేపింది.

**దైవదర్శనానికి వెళ్లగా.. భారీ దొంగతనం**

పోలీసుల కథనం ప్రకారం.. బ్యాంక్ కాలనీ (హౌస్ నెం. 815/1) నివాసి పూర్ణచంద్రరావు తన భార్యతో కలిసి గురువారం (మార్చి 5న) ఉదయం 6 గంటల ప్రాంతంలో జోగులాంబ దేవాలయ దర్శనానికి వెళ్లారు. రోజంతా గడిపి రాత్రి 9 గంటల సమయంలో తిరిగి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉండటాన్ని చూసి వారు దిగ్భ్రాంతికి లోనయ్యారు.
బీరువాలో చిందరవందరగా వస్తువులు
లోపలికి వెళ్లి చూడగా.. గుర్తు తెలియని దుండగులు బీరువాలను తెరిచి వస్తువులన్నీ చిందరవందరగా పడేశారు. బీరువాలో భద్రపరిచిన సుమారు రూ. 30,000/ నగదుతో పాటు మరికొన్ని విలువైన వస్తువులను అపహరించుకుపోయినట్లు బాధితుడు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

* **రంగంలోకి పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం**

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

* క్లూస్ టీం నివేదిక: వేలిముద్రలు, ఇతర ఆధారాల కోసం పోలీసులు క్లూస్ టీం సాయం తీసుకుంటున్నారు.
* సీసీ ఫుటేజీ పరిశీలన: కాలనీలోని సీసీ కెమెరాల దృశ్యాలను విశ్లేషించి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు ధీమా వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండాలి: ఇళ్లకు తాళం వేసి వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా పొరుగువారిని అప్రమత్తం చేయాలని పోలీసులు ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

# పెళ్లికి వెళ్లి “రప్పా రప్పా” అంటూ దాడులు చేయటం ఎక్కడి సంస్కృతి?

అమరావతి, మార్చి 06 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీ నేతల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొత్తగా ‘రప్పా రప్పా’ రాజకీయం మొదలైందని, పరామర్శలకు, శుభకార్యాలకు వెళ్లి విధ్వంసం సృష్టించడం ఎక్కడి సంస్కృతి అని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలు, తిరుమల లడ్డూ వ్యవహారం, కూటమి ఎమ్మెల్యేల ప్రవర్తన, స్వర్ణాంధ్ర లక్ష్యాలపై సీఎం సుదీర్ఘంగా ప్రసంగించారు.

*** రప్పా రప్పా అంటూ దాడులు.. ఇదేం సంస్కృతి?**

రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. ‘‘రాష్ట్రంలో ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చింది. ఒక నాయకుడు పర్యటన చేస్తే రప్పా రప్పా అంటున్నారు. అసలు పెళ్లికి వెళ్లి రప్పా రప్పా అంటూ దాడులు చేస్తారా? భద్రత కోసం వచ్చిన ఎస్ఐ గాయపడినా కనీసం పట్టించుకోలేదు. గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకుని తిరిగే నాయకుడు దేశంలో ఎక్కడైనా ఉంటారా?’’ అని సీఎం ప్రశ్నించారు. కటౌట్లకు పొట్టేళ్ల రక్తంతో అభిషేకం చేయడం, నేరుగా హింసను ప్రోత్సహించడం ఫ్యాక్షనిజాన్ని తలపిస్తోందన్నారు. కేవలం 5 కిలోమీటర్ల దూరాన్ని వెళ్లేందుకు 67 గంటల సమయం తీసుకుంటూ, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ ప్రతిపక్షంలో ఉండి హెచ్చరికలు జారీ చేయడం దేశ చరిత్రలో ఏ పార్టీ చేయలేదని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టుమార్టానికి కారకులైన వారే పరామర్శలకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు.

**లడ్డూ అపవిత్రం.. క్షమాపణ లేని దౌర్జన్యం**

తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై సీఎం స్పందిస్తూ, ఇది తెలియకుండా జరిగిన పొరపాటు కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర అని ఆరోపించారు. ‘‘ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోంది. ఎన్డీడీబీ నివేదిక కూడా నెయ్యి కల్తీ జరిగిందని స్పష్టంగా తేల్చింది. దేశవ్యాప్తంగా పీఠాధిపతులు, హిందూ సంఘాలు ఖండించినా.. కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదు’’ అని అన్నారు. ప్రభువా క్షమించు అంటూ పత్రికల్లో రాతలు రాయించుకున్న వ్యక్తి, వెంకటేశ్వర స్వామికి మాత్రం క్షమాపణ చెప్పరా అని నిలదీశారు. తప్పు ఒప్పుకోకపోగా శాసనమండలిలో గొడవ చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు.

**అభివృద్ధి - శాంతిభద్రతలు**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామని, సుప్రీంకోర్టు అనుమతితో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు ప్రకటించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఉగాది నాటికి 3 లక్షల గృహప్రవేశాలు, సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు సిద్ధం చేస్తున్నామన్నారు. చివరగా, సోషల్ మీడియాలో సైకోల్లా వ్యవహరిస్తున్న వారిపై, వైట్ కాలర్ నేరగాళ్లపై కఠిన చర్యలు ఉంటాయని, మహిళలపై నేరాలకు పాల్పడితే అదే వారికి చివరి రోజు అవుతుందని సీఎం తీవ్రంగా హెచ్చరించారు.

## శాసనమండలికి వచ్చిన బొత్సను ఆత్మీయంగా పలకరించిన నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఈరోజు ఒక ఆసక్తికరమైన, ఆరోగ్యకరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఇటీవల వైసీపీ నేత, మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్వల్ప అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందారు. అనారోగ్యం నుంచి కోలుకున్న ఆయన ఈరోజు సభకు హాజరయ్యారు. బొత్స సభలోకి రాగానే మంత్రి నారా లోకేశ్ ఎంతో ఆత్మీయంగా స్పందిస్తూ, ‘బొత్స సత్యనారాయణ గారు నమస్కారం’ అంటూ పలకరించారు. తొలుత బొత్స గమనించకపోవడంతో, మండలి చైర్మన్ మోషేను రాజు జోక్యం చేసుకుని మంత్రి మిమ్మల్ని పలకరిస్తున్నారని తెలియజేశారు. “గురువుగారు (బొత్స) చిన్న అనారోగ్య సమస్యతో బాధపడ్డారు. ఆయన మళ్ళీ పూర్తి ఆరోగ్యంతో సభకు రావడం చాలా సంతోషంగా ఉంది” అని లోకేశ్ అన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ కి బొత్స ధన్యవాదాలు తెలిపారు. రాజకీయంగా వైరిపక్షాలైనప్పటికీ, వ్యక్తిగత ఆరోగ్యం విషయంలో లోకేశ్ చూపిన ఈ గౌరవం సభలో అందరినీ ఆకట్టుకుంది.

## సోషల్ మీడియాలో వైరల్ అవ్వాలని రిస్క్ వద్దు

హైదరాబాద్, మార్చి 06 (భారత శక్తి): సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవ్వాలని, లైకుల కోసం యువత జీవితాన్ని రిస్క్ చేయవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హితవు పలికారు. ఒక యువకుడు వేగంగా కదులుతున్న రైలు నుంచి వేలాడుతూ రీల్ చేస్తుండగా స్తంభం ఢీకొట్టి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేసి, లైఫ్‌ను రిస్క్ చేసేవారిని హెచ్చరించారు. “సోషల్ మీడియాలో వైరల్ అవ్వాలని తపన పడే వారికి ఇదో హెచ్చరిక. నడుస్తున్న రైలుకు వేలాడుతూ చేసే ఈ స్టంట్లు చూస్తుంటే ప్రాణం మీద తీపి కంటే ఫోన్లో వచ్చే లైకుల మీద ఆశ ఎక్కువైపోయినట్టుంది. ఇలాంటి తెలివితక్కువ పనుల వల్ల ఆ యువకుడికి దక్కింది ఏంటి? కేవలం ఆసుపత్రి బెడ్ లేదా అంతిమయాత్రే కదా. మీ పిచ్చి విన్యాసాలకు ప్రాణం పోయే వరకు ఆగుతారా? ఇంట్లో మీ కోసం ఎదురుచూసే వాళ్ల గురించి కనీసం ఒక్కసారైనా ఆలోచించారా? లైకుల కోసం లైఫ్ రిస్క్ చేసేంత పిచ్చి వద్దు. ప్రాణం పోయాక ఆ రీల్స్ ఎవరూ చూడరు. మీ కుటుంబం మాత్రం జీవితాంతం కన్నీళ్లు పెడుతుంది” అని హితవు పలికారు.

### చెప్పులు కుట్టిన జాతి.. ఈ రాజ్యాన్ని నడపాలి..

# సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 06 (భారత శక్తి): ఎన్నో ఏండ్లుగా అణిచివేతకు గురై.. చెప్పులు కుట్టిన జాతి ఈ రాజ్యాన్ని నడపాలి అని సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైటెక్ సిటీ సమీపంలోని శిల్పా కళా వేదికలో మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసిన సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వానికి కళ్లు, చెవులు, బ్రాండ్ అంబాసిడర్లు నా ప్రభుత్వ ఉద్యోగులే. 99 రోజుల ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని తీసుకున్నాం.. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. ప్రతి పేద వాడికి రేషన్ కార్డు అందాలంటే మీరు కష్టపడి పనిచేయాలి. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి కోసం పేదలు ఎదురు చూస్తున్నారు. అత్యంత వెనుకబాటు తనంలో మాదిగ జాతి ఉంది.. ప్రభుత్వ. ఉద్యోగులు వాళ్లకు అండగా ఉండాలి. సంక్షేమం, అభివృద్ధిని అందించాలన్నదే మా సంకల్పం అని సీఎం పేర్కొన్నారు.

*** ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులది..**

ప్రతి నెల 1000 మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. నెలకు 1000 కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి వస్తోంది. అయినా సమన్వయం చేసుకుని ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాం. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులది. అక్రమాలను అరికట్టి ఖజానాకు నిధులు తీసుకువస్తే పది మందికి సహాయం అందుతుంది. గతంలో జాగీరుదారులు, జమీందార్ల దగ్గర వేలాది ఎకరాల భూములు ఉండేవి. అసైన్డ్ భూముల విషయంలో ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుంది. పంచడానికి ప్రభుత్వం దగ్గర భూములు లేవు. ప్రభుత్వానికి ఆర్థిక వెసులుబాటు పరిమితంగా ఉంది అని సీఎం తెలిపారు.

*** మీ జాతి కోసం ఏం చేయాలో అన్ని చేస్తాం..**

దారిద్ర్య రేఖలో ఉన్న జాతి ముందుకు నడవాలంటే విద్య అవసరం. నా దగ్గర ఉన్న విద్యా శాఖలను ప్రక్షాళన చేస్తున్నాను. నాణ్యమైన విద్య కోసం ప్రణాళికలు రచిస్తున్నాం. ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు కాస్మోటిక్ , డైట్ ఛార్జీలు పెంచాం. విద్య ఒక్కటే మీ జీవితంలో మార్పు తీసుకువస్తుంది. అవకాశం వస్తే పది మందికి సాయం చేస్తారనే మంచి పేరు మీరు, నేను తెచ్చుకోవాలి. మీ జాతి కోసం ఏం చేయాలో అన్ని చేస్తాం.. మీ హక్కులను చట్టబద్ధం చేసి కాపాడుతాం. చట్టబద్ధమైన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మీది అని సీఎం అన్నారు.

*** మీరాకుమార్ స్ఫూర్తితో పని చేస్తా**

గత ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చింది.. చెప్పులు కుట్టుకొమ్మని చెప్పింది. బర్రెలు, గొర్రెలు, చేపలు కాదు.. చెప్పులు కుట్టుకున్న జాతి ఈ రాజ్యాన్ని నడపాలి.. కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు కావాలి. తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి. నా శక్తి ఉన్నంత వరకు మీకు సాయం చేస్తాను. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మీరాకుమార్ ఎలా పనిచేశారో అలాంటి స్ఫూర్తితో పనిచేస్తానని రేవంత్ పేర్కొన్నారు.

*** ఎలా పిలిచినా ఇబ్బంది లేదు.. నేను అందరి వాడిని..**

ఎస్సీ వర్గీకరణ చేసినప్పుడు రేవంత్ మాదిగ, బీసీలు రేవంత్ యాదవ్, వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇస్తే రేవంత్ ముదిరాజ్ అని, సిక్కులు సర్దార్ రేవంత్ అని అసదుద్దీన్ కు సాయం చేశానని రేవంతుద్దీన్ అని నన్ను అన్నారు. ఎలా పిలిచినా ఇబ్బంది లేదు.. నేను అందరి వాడిని. సీఎంగా వచ్చిన అవకాశాన్ని పది మందికి సహాయం చేయడానికే అని భావిస్తున్న. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని మీ జాతికి చేయూత ఇచ్చినప్పుడే నాకు నిజమైన సంతోషం కల్గుతుంది అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### పశ్చిమాసియాలో యుద్ధం..

## శంషాబాద్ నుంచి 12 విమానాలు రద్దు

హైదరాబాద్, మార్చి 06 (భారత శక్తి): శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లవలసిన 12 విమానాలు రద్దయ్యాయి. ఈ మేరకు ఆర్జీఐఏ అధికారులు వెల్లడించారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన విమానాలతో పాటు గల్ఫ్ దేశాల నుంచి రావాల్సిన మరో 12 విమానాలు కూడా రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన విమానాలు రద్దైనట్లు అధికారులు వెల్లడించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 23 వేలకు పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. దీనితో విమానయాన సంస్థలకు రూ.100 కోట్ల డాలర్లకు పైగా నష్టం వాటిల్లింది. ఇది భారత కరెన్సీలో సుమారు రూ.9,165 కోట్లు. భారత విమానయాన సంస్థలపై కూడా ఈ ప్రభావం అధికంగానే ఉంది.

## లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు

ఇరాన్, మార్చి 06: ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం జరగాలన్నా, ఆ దేశం బేషరతుగా లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ట్రూత్ సోషల్’లో ఒక పోస్ట్ చేశారు. “ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలి! ఆ తర్వాత అక్కడ గొప్ప, ఆమోదయోగ్యమైన నాయకత్వం రావాలి. అప్పుడే మేము, మా మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను వినాశనం అంచుల నుంచి బయటకు తీసుకొస్తాం. ఇరాన్‌ను ఆర్థికంగా మునుపటి కంటే బలంగా తీర్చిదిద్దుతాం. ఇరాన్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుంది” అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా తన ఎన్నికల నినాదాన్ని గుర్తుచేస్తూ.. “మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్” అంటూ కొత్త నినాదాన్ని వినిపించారు. మరోవైపు అమెరికా ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. క్షిపణి దాడులు, నావికాదళ దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై దాడులు విస్తృతం చేయగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడుతోంది. కొన్ని రోజుల కిందట హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి ముంచేయడం ఉద్రిక్తతలను పతాక స్థాయికి చేర్చింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో వెయ్యి మందికి పైగా మరణించగా, ఇజ్రాయెల్, లెబనాన్‌లలో డజన్ల కొద్దీ ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురుస్తుండటంతో వేలాది మంది రాజధానిని వదిలి పారిపోతున్నట్లు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా, ట్రంప్ యుద్ధ అధికారాలను నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలను వాషింగ్టన్‌లో సెనేట్ రిపబ్లికన్లు అడ్డుకున్నారు. ప్రస్తుతానికి అమెరికా బలగాలు నేరుగా రంగంలోకి దిగకపోయినా, భవిష్యత్తులో ఆ అవకాశాన్ని వైట్ హౌస్ కొట్టిపారేయలేదు. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై తీవ్రంగా పడుతోంది. హార్ముజ్ జలసంధిలో దాడుల భయంతో నౌకల రాకపోకలు తగ్గిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు షిప్పింగ్ సంస్థలు తమ సర్వీసులను నిలిపివేస్తున్నాయి.

### 50 యుద్ధ విమానాలతో

## ఖమేనీని అంతం చేశాం

మార్చి 06: ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని అంతం చేయడానికి ఇజ్రాయెల్ చేపట్టిన భారీ సైనిక చర్యకు సంబంధించిన కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఫిబ్రవరి 28న టెహ్రాన్ లోని ఇరాన్ ప్రభుత్వ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిలో దాదాపు 50 యుద్ధ విమానాలు పాల్గొన్నాయని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. ‘ఆపరేషన్ రోర్ ఆఫ్ ది హారియర్’ పేరుతో ఈ దాడిని నిర్వహించినట్లు తెలిపింది. ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ విభాగం అందించిన పక్కా సమాచారంతో, టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న లీడర్ షిప్ కాంప్లెక్స్ కింద నిర్మించిన భారీ భూగర్భ బంకర్ ను లక్ష్యంగా చేసుకుని ఈ వైమానిక దాడులు జరిగాయి. అత్యవసర సమయాల్లో యుద్ధ కార్యకలాపాలు నిర్వహించడానికి, తమ మిలిటరీ ప్లాన్స్ అమలు చేయడానికి ఇరాన్ పాలకులు ఈ బంకర్ ను ఎన్నో ఏళ్ల పాటు శ్రమించి నిర్మించుకున్నారని ఐడీఎఫ్ పేర్కొంది. అనేక వీధులకు విస్తరించి ఉన్న ఈ బంకర్ లో సీనియర్ అధికారుల కోసం మీటింగ్ రూమ్ లు, ఎంట్రీ పాయింట్లు ఉన్నాయని, దీనిని ఖమేనీ వినియోగించుకునేలోపే ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం వివరించింది. ఖమేనీ హతం తర్వాత కూడా ఇరాన్ సీనియర్ అధికారులు ఈ కాంప్లెక్స్ ను వినియోగిస్తున్నారని ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడి ద్వారా ఇరాన్ అత్యంత కీలకమైన కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను దెబ్బతీశామని, ఇది ఆ దేశ మిలిటరీ సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొంది. ఇరాన్ లోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన ఈ ప్రాంతాన్ని సుదీర్ఘ నిఘా అనంతరం ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ స్పష్టం చేసింది.

## కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయి

అమెరికా, మార్చి 06: అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత తీవ్రతరమైన ఉద్రిక్తతలను తగ్గించేందుకు “కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ప్రారంభించాయి” అని ఆయన శుక్రవారం ప్రకటించారు. ప్రాంతీయ శాంతికి తాము కట్టుబడి ఉన్నామని, అయితే ఇరాన్ ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేసిన వారికి ఈ మధ్యవర్తిత్వం సరైన సమాధానం కావాలని ఆయన ‘ఎక్స్’ వేదికగా స్పష్టం చేశారు. తమ దేశ గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

**కొనసాగుతున్న ఇరాన్ ప్రతీకారం**

అధ్యక్షుడి ప్రకటన ఒకవైపు ఉండగా.. క్షేత్రస్థాయిలో ఇరాన్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ తన అత్యంత శక్తివంతమైన ‘ఖొర్రమ్‌షహర్ 4’ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని తస్నీమ్ వార్తా సంస్థ వెల్లడించింది. “ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 4”లో భాగంగా 22వ విడత దాడులు మొదలయ్యాయని, ఇవి నేరుగా ఇజ్రాయెల్ భూభాగంపై విరుచుకుపడుతున్నాయని ఇస్లామిక్ రెవెల్యూషన్ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) తెలిపింది. మరోవైపు, లెబనాన్‌లోని సిడాన్ నగరంలో శుక్రవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఓ నివాస భవనం దెబ్బతిన్నట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది.

*** విరుచుకుపడుతున్న అమెరికా ‘ఎపిక్ ఫ్యూరీ’**

మరోవైపు, ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా చేపట్టిన ‘ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ’ని మరింత ఉధృతం చేస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. ఫ్లోరిడాలోని టాంపాలో ఉన్న సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ నావికాదళాన్ని, క్షిపణి కేంద్రాలను తమ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయని తెలిపారు. “మేము ఈ పోరాటానికి సిద్ధంగా ఉన్నాం, విజయం సాధించే దిశగా వెళ్తున్నాం” అని ఆయన వ్యాఖ్యానించారు.

**ఇరాన్‌కు భారీ నష్టం: అమెరికా ప్రకటన**

ఈ ఆపరేషన్ ఆరో రోజుకు చేరుకుందని, ఇరాన్ మిలటరీ సామర్థ్యం గణనీయంగా తగ్గిందని అమెరికా సెంట్రల్ కమాండ్ చీఫ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు.

- గత 72 గంటల్లో టెహ్రాన్ పరిసరాల్లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్లు దాడులు చేశాయి.
- భూగర్భంలో దాచిన క్షిపణి లాంచర్లను ధ్వంసం చేసేందుకు బీ2 బాంబర్ల ద్వారా 2000 పౌండ్ల బాంబులను జారవిడిచారు.
- ఇప్పటివరకు 30కి పైగా ఇరాన్ నౌకలను సముద్రంలో ముంచేశారు. ఇందులో రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ పరిమాణంలో ఉన్న ఓ భారీ డ్రోన్ క్యారియర్ షిప్ కూడా ఉందని, అది ప్రస్తుతం మండుతోందని కూపర్ తెలిపారు.
- అమెరికా దాడుల ఫలితంగా ఇరాన్ నుంచి వచ్చే బాలిస్టిక్ క్షిపణి దాడులు 90 శాతం, డ్రోన్ దాడులు 83 శాతం తగ్గుముఖం పట్టాయని ఆయన వివరించారు.
- ఇరాన్ స్పేస్ కమాండ్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా దెబ్బతీశామన్నారు.
- కేవలం ఇరాన్ దగ్గర ఉన్న ఆయుధాలను ధ్వంసం చేయడమే కాకుండా.. భవిష్యత్తులో వారు తిరిగి కోలుకోలేనంతగా క్షిపణి తయారీ పరిశ్రమను నేలమట్టం చేయడమే తమ తదుపరి లక్ష్యమని అమెరికా స్పష్టం చేసింది.

# శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలకు జిల్లా యంత్రాంగం, టిటిడి సమిష్టిగా సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలి

**: జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి**

*** -ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామిబ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు : జేఈఓ వి. వీరబ్రహ్మం**

ఒంటిమిట్ట, మార్చి 06 (భారత శక్తి): ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో జరగనున్న శ్రీ కోదండ రామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమి మరియు శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమిష్టి గా సమన్వయం తో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. ఒంటిమిట్ట టిటిడి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం,జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తదితర అధికారులతో కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో మార్చి 26న అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభమై, మార్చి 27నధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని తెలిపారు. ఏప్రిల్ 1న జరిగే శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పట్టు వస్త్రాల సమర్పణ జరగనుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గారు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా పటిష్ఠ బందోబస్తు వ్యవస్థ, హెలిప్యాడ్, భక్తుల రద్దీ నేపథ్యంలో ప్రశాంతంగా స్వామివారి దర్శన భాగ్యం కలిగేందుకు వీలుగా పటిష్టమైన బ్యారికేడింగ్ వ్యవస్థ,భక్తులకు అన్నదానం, గ్యాలరీలలో తాగునీరు మజ్జిగ పంపిణీ, మీడియా కవరేజ్ నిమిత్తం లైవ్ స్ట్రీమింగ్, మెడికల్ క్యాంపు నిర్వహణ,గ్యాలరీ లలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం మెడికల్ సిబ్బంది, ప్రతి శాఖ వారు చేపట్టవలసిన ఏర్పాట్లపై శాఖల




వారీగా సమీక్షిస్తూ టీటీడీ అధికారులతో జిల్లా యంత్రాంగం సమన్వయం చేసుకొని బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అందరి సమిష్టిగా పని చేయాలన్నారు. టిటిడి జెఈ ఓ వి.వీరబ్రహ్మం మాట్లాడుతూ, భక్తుల రద్దీ దృష్ట్యా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, గ్యాలరీలు, పార్కింగ్, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ వంటి ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ, అంబులెన్స్ సేవలు, నిరంతర విద్యుత్ సరఫరా, పుష్పాలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం, టిటిడి అధికారులతో జిల్లా కలెక్టర్, టిటిడి జేఈవో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు, రాజంపేట సబ్ కలెక్టర్ భావన,టిటిడి సీఈ సత్యనారాయణ, ఎస్ ఈలు మనోహరం, వేంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర కుమార్, సెల్వం, శివప్రసాద్, అన్నప్రసాదం ప్రత్యేక అధికారి జి ఎల్ ఎన్ శాస్త్రి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# నేడు జిల్లా నూతన న్యాయస్థాన భవనానికి శంకుస్థాపన

*** రాబోతున్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్.**

*** ఏర్పాట్లు పూర్తి:జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ..**

రాజన్నసిరిసిల్ల ప్రతినిధి, మార్చి 06 (భారత శక్తి): సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతన న్యాయస్థాన భవన సముదాయ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా, అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించ తలపెట్టిన ఈ భవనానికి ఈ నెల 7న శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, హై కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాం జి పాల్గొంటారు. వీరితో పాటు న్యాయమూర్తులు జస్టిస్ పి. శ్యామ్ కోసి, జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ విజయ సేన్ రెడ్డి, జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ జె. శ్రీనివాస్ రావు, జస్టిస్ నందికొండ నర్సింగరావు తదితరులు ఈ వేడుకలో పాలుపంచుకోనున్నారని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. జిల్లాలోని అధికార, అనధికార ప్రముఖులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# పైసా వసూల్ వచ్చే ఏడాది ఫీజులు
# ఇప్పుడే చెల్లించాలంటూ నారాయణ స్కూల్ హుకుం జారీ!

*** చూసీ చూడనట్టు అధికారుల తీరు..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 06 (భారత శక్తి): భైంసా పట్టణంలోని నారాయణ కార్పొరేట్ హై స్కూల్ పై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియకముందే వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులు ఇప్పుడే చెల్లించాలని పాఠశాల నిర్వాహకులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపిస్తున్నారు. భైంసా పట్టణానికి చెందిన ఓ విద్యార్థి తండ్రి సాహెబ్ రావు పటేల్ మాట్లాడుతూ, తన కూతురు ప్రస్తుతం 9వ తరగతి చదువుతుందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో 10వ తరగతి కి మొత్తం ఫీజు రూ.50,000గా నిర్ణయించి, అందులో 50 శాతం అంటే రూ.25,000 ఇప్పుడే చెల్లించాలని స్కూల్ యాజమాన్యం డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. డబ్బులు చెల్లించకపోతే సిలబస్ పుస్తకాలు ఇవ్వడం లేదని, ఆన్లైన్‌లో పేరు నమోదు






చేయడం లేదని కూడా హెచ్చరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా వచ్చే విద్యా సంవత్సరానికి దాదాపు ఆరు నెలలు సమయం ఉండగా ముందుగానే ఫీజులు చెల్లించమని ఒత్తిడి చేయడం అన్యాయమని తల్లిదండ్రులు అంటున్నారు. అంతేకాకుండా యూనిఫామ్‌లు, స్టేషనరీ పేరుతో అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్నారని, పాఠశాలలో జరిగే ఏ ప్రైవేట్ కార్యక్రమాలు చేపట్టిన తల్లిదండ్రుల చే డబ్బులు వసూలు చేస్తున్నా ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే మండల విద్యాధికారి సుభాష్ కు మరియు జిల్లా విద్యాధికారి భోజన్నాకు ఫిర్యాదు చేసినట్లు సాహెబ్ రావు పటేల్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. తల్లిదండ్రుల ప్రశ్న: పిల్లల భవిష్యత్తు పేరుతో ప్రైవేట్ స్కూల్స్ ఇలా ముందుగానే ఫీజులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా లేదా అనే దానిపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

# చించోలి–బి మహిళా ప్రాంగణంలో PMEGP పై అవగాహన..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 06 (భారత శక్తి): సారంగాపూర్ మండలంలోని చించోలి-బి గ్రామంలో గల మహిళా ప్రాంగణంలో ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి పథకంపై అవగాహన కార్యక్రమాన్ని ఎంటర్‌ప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ సెంటర్, నిర్మల్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, TSWC DC విజయలక్ష్మి హాజరై PMEGP, PM FME పథకాలతో పాటు ఆర్థిక అక్షరాస్యతపై పాల్గొనేవారికి అవగాహన కల్పించారు. యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. అలాగే వ్యాపార అభివృద్ధి, వ్యాపార ప్రణాళిక తయారీ మరియు ఎంటర్‌ప్రెన్యూర్షిప్ నైపుణ్యాలపై పాల్గొనేవారికి మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో EDC మేనేజర్ శ్రీ అభినయ్ దీప్, అసిస్టెంట్ మేనేజర్ తేజేశ్వి తదితరులు పాల్గొన్నారు.







# అన్నదమ్ముల మధ్య గొడవ..
# తమ్ముడిని హత్య చేసిన ముగ్గురికి 10 ఏళ్ల జైలు

సైబరాబాద్, మార్చి 06 (భారత శక్తి): మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి కోర్టు తీర్పు వెలువరించిందని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెలితే మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహేంద్ర ప్రసాద్ మిశ్రా (29), ధర్మేంద్ర ప్రసాద్ మిశ్రా (45), బీరేంద్ర ప్రసాద్ మిశ్రా (37) అన్నదమ్ములు మాదాపూర్ పరిధిలోని సిద్ధిక్‌నగర్‌లో అద్దె గదిలో నివాసం ఉండేవారు. 18 నవంబర్ 2016న వీరి మధ్య జరిగిన గొడవలో దేవేంద్ర ప్రసాద్ మిశ్రాపై ముగ్గురు నిందితులు కత్తి మరియు కిటికీ గాజు పలకతో దాడి చేశారు. ఈ దాడిలో దేవేంద్ర ప్రసాద్ మిశ్రా గొంతు వద్ద తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 701/2016గా కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అనంతరం పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారణ పూర్తి చేసిన రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి కోర్టు VI అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి శ్రీమతి. సి. పావని నిందితులు ముగ్గురినీ దోషులుగా తేల్చి, ఒక్కొక్కరికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని డీసీపీ తెలిపారు.

# భైంసాలో ఆల్ఫోర్స్ పాఠశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 06 (భారత శక్తి): భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు హాజరై విద్యార్థులకు అగ్నిప్రమాదాల వల్ల సంభవించే ప్రమాదాలు, నష్టాలు మరియు అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఎలా సురక్షితంగా బయటకు రావాలి, అలాగే అగ్నిని



ఎలా అదుపులోకి తీసుకురావాలో అధికారులు ప్రదర్శనల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఫైర్ సేఫ్టీ పరికరాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో భయపడకుండా తక్షణమే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. అగ్నిప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వారు విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సిద్ధూర్ గ్రామ పంచాయతీ పరిధిలో వి.ఓ భవన నిర్మాణానికి మొగ్గు కార్యక్రమం

**ఘనంగా నిర్వహణ..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 06 (భారత శక్తి): సిద్ధూర్ గ్రామ పంచాయతీ పరిధిలో వి.ఓ (విల్లేజ్ ఆర్గనైజేషన్) భవన నిర్మాణానికి సంబంధించిన మొగ్గు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. గ్రామ అభివృద్ధికి మరో ముందడుగుగా ఈ కార్యక్రమం జరగడం గ్రామ ప్రజలకు ఆనందాన్ని కలిగించింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్పతి బాయి,(సుధాకర్) ఉప సర్పంచ్ అవినాష్, ఈసీ రాజ్ కుమార్, ఏఈ శివ, పంచాయతీ సభ్యులు ఆకాష్, భూషణ్, మాజీ సర్పంచ్ మారుతి, లింగ గ్రామ మాజీ సర్పంచ్ గణేష్, పంగ్రి గ్రామ మాజీ సర్పంచ్ దిగంబర్ పటేల్, ఐకెపి రాములు, గ్రామ పెద్దలు సయ్యద్ మరియు గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు అందరూ కలిసికట్టుగా సహకరించాలని గ్రామ



నాయకులు పిలుపునిచ్చారు. గ్రామంలో అభివృద్ధి పనులు మరింత వేగంగా కొనసాగేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.

# 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతం చేయాలి

హైదరాబాద్, మార్చి 06 (భారత శక్తి): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. రెండేండ్ల పాలనను వివరించడంతో పాటు ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లేలా కాంగ్రెస్ ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో శుక్రవారం (ఫిబ్రవరి 6 నుంచి) 99 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించ నుంది. ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లడం ఇది మూడోసారి. అధికారం చేపట్టిన తర్వాత 2023 డిసెంబర్ 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలన గ్రామ, వార్డు సభలను నిర్వహించింది. గతేడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరిలో 3 రోజుల పాటు రెండోసారి ప్రజా పాలన గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించింది. ఇప్పుడు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరుతో కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు స్థాయిల్లో కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా జిల్లాల ఇనాచార్జి మంత్రుల ఆధ్వర్యంలో శుక్రవారం సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నది. నేటి నుంచి ఈనెల 15 వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కారం చేపట్టనున్నారు. జూన్ 12న ఈ కార్యక్రమం ముగియనుంది.




Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.